# Telugu Jyothi

# తెలుగు జ్యోతి

A Literary Magazine from The Telugu Fine Arts Society

తెలుగు కళా సమితి వారి సారస్వత పత్రిక

http://www. tfasnj.org http://www.TeluguJyothi.com March - April 2015




**తెలుగు కళా సమితి సభ్యులకు, మా ప్రకటనదారులకు మన్మథ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు !!**

# DENTISTRY FOR THE ENTIRE FAMILY

Member of ADA, NJDA & AEGD

## DENTAL ILLUMINATIONS

### Madhavi V. Kadiyala DDS & Associates

### General and Cosmetic Dentistry

- Digital Radiography X-Ray with Less Radiation
- Oral Hygiene, Sealants. Fluoride
- Bonding, Porcelain Veneers & Lumineers
- Teeth Whitening
- Periodontal Treatment
- One Visit Root Canals
- Metal Filling Replaced with White Restorations
- Surgical & Non Surgical Extractions
- Porcelain Crowns, Bridges & Complete Dentures

**Walk-ins & New Patients Welcome   Most Insurance Plans Accepted**

**Please Call For Appointments at Two Convenient Locations**

660 Princeton Meadows
Shopping Center,
Plainsboro Road
**Plainsboro, NJ 08536**
609-275-9688

Hopewell Crossing
800 K Denow Road
(Next to Stop & Shop)
**Pennington, NJ 08534**
609-303-0571

# PLAINSBORO PRINCETON MEDICAL ASSOC.

**Dr. Aruna Chakrala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Sureka Reddy, MD**
BOARD CERTIFIED FAMILY MEDICINE

**Dr. Sangeeta Buddala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Pramila Veera Swamy, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

***OPEN 7 DAYS A WEEK!***

Blood Draws • 2D Echo Cardiograms • EKG • All Immunization Including Travel Vaccines • Minor Skin Procedures Including Wart Removals, ***LASER SERVICES,*** Dietician, Diabetic Management, Joint Injections, Pap Smears

666 Plainsboro Road, Suite 1020 • Plainsboro, NJ 08536

***CALL TODAY 609-799-5000***

**OFFICE HOURS: MON-FRI 8AM-8PM, SAT & SUN 8AM-2PM**
**LANGUAGES: ENGLISH, TELUGU, HINDI, MARATHI, SPANISH**
**AGE GROUPS : 8 YEARS & ABOVE**

# తెలుగు కళా సమితి

## The Telugu Fine Arts Society, Inc

(A tax exempt and not for profit corporation)

54 Erie Ave, Rockaway, NJ 07866

# తెలుగు జ్యోతి

సంపుటి: 32 సంచిక: 2

**మార్చి – ఏప్రిల్ 2015**



**Board of Trustees**
**April 2014 – March 2016**

**President**
***Srini Gandi***
208 Margaret Ct, South Plainfield, NJ 07080
(732) 221-8017
president@tfas.net

**Vice-President**
***Guru Alampalli***
23 Harold Ave
Edison, NJ08820
(732) 277-8870
vicepresident@tfas.net

**Secretary**
***Uma Makam***
13 Alexis Lane,
Edison, NJ 08820
(732) 983-1936
secretary@tfas.net

**Treasurer**
***Vasant Naidu Tanna***
287 Pinelli Drive
Piscataway, NJ 08854
(732) 319-8155
treasurer@tfas.net

**Annual Events**
***Sreedevi Jagarlamudi***
*(732) 470-7055*
events@tfas.net

**Youth Services**
***Bindu Madiraju***
(732) 609-1836
youth@tfas.net

**Membership Services**
***Vamsi Koppuravuri***
1 Newburgh Drive,
Edison, NJ - 08820
(732) 429-4421
membership@tfas.net

**IT Services**
***Madhu Rachakulla***
(913) 220-9172
info@tfas.net

**Community Affairs**
***Madhu Anna***
(201)674-5477
community@tfas.net

**Advisors**
***Dr. Ramakrishna Seethala***
***Dr.Suneetha Kanumuri***
**Mr. Rohinikumar Vemula**

**Founder Editor:**
**Late Kidambi Raghunath**



**Editor: Diwakar Peri**, Phone (732) 329-3464
Mail articles to: 29 Yorktown Road, Monmouth Jn. NJ 08852 or diwakar.peri@gmail.com

**Associate Editors: Anantha Sudhaker Uppala** Production Support**; Radha Kasinadhuni** - Essays & Community News; **Syamaladevi Dasika** - Stories; **Dr. Vaidehi Sasidhar** – Poems.
**Madhu Anna** and **Guru Alampalli** representing TFAS Board of Trustees.


## మా మాట

"యావత్తైలం-తావద్వ్యాఖ్య." దీపంలో చమురును బట్టి వచ్చే వెలుతురు, ఆ వెలుతుర్లో మన పని జరగడం ఆధారపడి వుంటుంది. మన జ్యోతిలో వివిధ రచయితలనుంచి ధారాళంగా రచనలు రావాలంటే – మన పాఠకులు జ్యోతిలో వచ్చే రచనలపై వారి అభిప్రాయాల్ని వారికి తెలియచెయ్యాలి. దీనివల్ల మన వారికిచ్చే గౌరవం, వారి రచనలకిచ్చే విలువ ప్రస్ఫుటమవుతాయి. ప్రస్తుతం తెలుగు జ్యోతికి రచనలు పంపిస్తున్న వారు చాల కొద్ది మంది. ఆ కుళాయి ధార సన్నబడితే, తెలుగు జ్యోతి ఉనికే ప్రశ్నార్ధకమవుతుంది. ఈ విషయం గురించి దయచేసి ఆలోచించండి. "అతిధి దేవో భవ" అన్నది మన భారతీయ సంస్కృతి లోని ప్రత్యేకత . మన ఆర్ష ధర్మంలో ప్రధానమయిన అంశం. ఇది. అయితే విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో ఇది ఎంతవరకూ ఆచరణ సాధ్యమన్నది ప్రశ్నించే వ్యాసం శ్రీ గవరసాన గారి "అతిధి దేవో భవ". కలియుగంలో మనం వున్న పరిస్థితుల్లో భారత యుద్ధం జరిగితే ఏమవుతున్నదన్న ఆలోచనపై ఓ భావావేశం శ్రీ గిరిజా శంకర్ గారి రచన "తమ్ముడి విషాద యోగం". రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి రచనలు చదవని, అయన పేరువినని సాహితీ ప్రియులు తెలుగు దేశంలో ఉండరంటే అతిశయోక్తి కాదు. అయన రచనలపై తనకున్న మమకారాన్ని, ఇతరులెవరూ ఆయనసాటి రారన్న తన భావాన్ని చక్కగా వ్యక్తీకరించిన రచన వై.వి.రమణ గారి వ్యంగ రచన "థాంక్యూ రా.వి.శాస్త్రీ!" వీరు తెలుగు బ్లాగ్ లోకంలో ప్రసిద్ధమయిన "పనిలేక " అనే బ్లాగ్ వ్రాస్తూ వుంటారు. అర్ధంలేని ఆచారాలకిబలయినా, తనకి జరిగిన అన్యాయం మరో స్త్రీకి జరగకుండా అడ్డుపడ్డ అమ్మమ్మ కథ "శిరోముండనం". ప్రసిద్ధ కథకులు శ్రీ గొర్తి బ్రహ్మానందంగారు, ఇంతకుముందు ఈమాటలో ప్రచురించబడ్డ ఈ కథని మనం ప్రచురించుకోటానికి అనుమతిచ్చారు.

అల్లాగే యువతరం , "ఈ-తరం" తెలుగు వాళ్ళపై చురక శ్రీమతి శ్యామలాదేవి గారి "ఇల్లాలి ముచ్చట్లు". ఇదికూడా ఈమాట నుంచి పునర్ముద్రితం. బతకలేక బడిపంతులు అన్న నానుడికి భిన్నంగా తాము ఒక టీచర్ గారి పిల్లలుగా పుట్టి పెరగడం ఎంత గొప్ప అనుభవమో తెలియచెప్పిన కథ "టీచర్ గారమ్మాయ్". బడిపంతులు ఉద్యోగం ఎంత గొప్పదో ఈ కథ మనకు తెలియచెప్పుతుంది. కొత్త రచయిత శ్రీదూపాటి తోలి ప్రయత్నం రిటైరుమెంటు. చేయని తప్పుకు తన రిటైరుమెంటు బెనిఫిట్స్ పోగట్టుకున్నాననుకున్న ఓ దురదృష్టవంతుని కథ ఇది. ఈ సంచికలో రచనలన్నీ చదివి మీ అభిప్రాయాల్ని మాకు ఈమెయిల్ ద్వారా తెలియచేస్తే వాటిని ఆయా రచయితలతో పంచుకుంటాం. తద్వారా వారికీ మన కృతజ్ఞతల్నితెలిపినట్లవుతుంది. తమ రచనల్ని తెలుగు జ్యోతిలో ప్రచురించడానికి అనుమతిచ్చిన రచయితలకి అనేక కృతజ్ఞతలతో , మీ అందరికీ మా ఉగాది శుభాకాంక్షలతో... దివాకర్ పేరి

## విషయసూచిక


| | |
|---|---|
| మామాట | 3 |
| TFAS President's Message | 5 |
| తెలుగు పాట డా. వడ్డేపల్లి కృష్ణ | 6 |
| అ - పరిచిత డా. ఊటుకూరి విజ్ఞానేశ్వర కుమార్ | 9 |
| అతిథి దేవో భవ! శ్రీ గవరసాన సత్యనారాయణ | 12 |
| తమ్ముడి విషాదయోగం డా. గిరిజా శంకర్ చింతపల్లి | 13 |
| థాంక్యూ రా.వి.శాస్త్రీ! డా. వై. వి. రమణ | 14 |
| జిడ్డు కృష్ణమూర్తి శ్రీ మోహన్ వల్లభజోశ్యుల | 19 |
| శిరోముండనం శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి | 25 |
| టీచర్ గారమ్మాయ్ శ్రీమతి గుళ్ళపల్లి అనుపమ | 32 |
| కొత్తతరం శ్రీమతి శ్యామలాదేవి దశిక | 35 |
| రిటైరు మెంటు శ్రీ దూపాటి శేషుకుమారచార్యులు | 37 |

కవర్ పేజీ: " **ఉగాది** " శ్రీ తురగా చలం



The articles published and the views expressed are those of the authors and not necessarily reflect the opinions of the editors or TFAS.



Dear Friends and Members of TFAS,

మీ అందరికీ ఉగాది శుభాకాంక్షలు. As I am writing this, we just finished conducting our first Paadutha Teeyaga Auditions for our young teens on March 14th 2015. Around 20 children have participated in singing competitions. All are qualified to move to next level with children from other states in USA. We also had a wonderful Trimurthy day program celebrated on March 15th with over 300 Children and Adults participating in singing Thyagarajaswamy, MuthuSwamy and Shyamashastri compositions. There were 3 concerts with talented Artists including Mr. Krishna Sridharan, Mrs. Radhika Murali and Mrs. Nirmala and Mr. Rajesh. Audience have enjoyed the full day program at Bridgewater temple.

Our new board of trustees have completed half of our term and embarking on second year of our 2 year tenure. We have lot many things to accomplish in the next 12 months including approval of by-laws, distribution of membership cards and streamlining our operations.

As many of you know, we are planning for our 30th Anniversary celebrations on July 11th 2015! We are working hard on bringing the very best quality programs in various segments including Literary, Drama, Dance and Music. It will be a whole day program with a Banquet on July 10th. I hope to see you all attending this event!!


TFAS is seeking literary articles for our 30th Anniversary Souvenir. And also requesting all of you to share your experiences with TFAS in the last 30 years to publish on our souvenir.


Thank you all again for your kind support!

Yours sincerely
Srini Gandi
President TFAS（president@tfas.net）


**Trimurty Day Expenses**

| | | |
|---|---|---|
| Total Donations | $1,422.00 | |
| | | |
| Total Expenses | | |
| Certificates Print | | $ 150.00 |
| Plaque Charges | | $ 350.00 |
| Audio System Rent | | $ 500.00 |
| Chapatis | | $ 80.00 |
| Supplies/Water | | $ 171.00 |
| | | |
| | $1,422.00 | $1,251.00 |
| Net Profit | | $ 171.00 |
| HTCS : $85.50 | TFAS : $85.50 | |










Stephen R. Shapiro, MD
Lawrence S. Kluger, MD
Jeffrey S. Unger, MD
Surya P. Irakam MD
FACP, FACG
Robert S. Wiesen, MD
Gastromed
Healthcare, P.A.
Excellence in Gastroenterology
PREVENTION & TREATMENT OF
DIGESTIVE DISEASES:
• Abdominal Pain Evaluation
• Acid Reflux & Ulcer Treatment
• Liver Disease Treatment & Evaluating
• Colon Cancer Screening
• Gastrointestinal Bleeding Management
• Hemorrhoid & Fissure Treatment
• Irritable Bowel Syndrome
• Ulcerative Colitis & Crohn's Disease
• Gallstones & Gall Bladder Disease
• Pancreatic Diseases
www.gastromedhealthcare.com
Gastromed@aol.com
286 East Main Street, Somerville, NJ
(908) 231-1999
515 Church Street, Bound Brook, NJ
(732) 356-0420
203 Towne Center Dr., Hillsborough, NJ
(908) 359-1639
1140 Stelton Rd., Suite 101, Piscataway, NJ
(732) 339-8810

# తెలుగు పాట

డా. వడ్డేపల్లి కృష్ణ

**డా. సి. నారాయణరెడ్డి (1931-ప్రస్తుతం):** ఆధునికాంధ్ర సాహిత్యాన్ని మథించి 'డాక్టరేట్' పట్టాను పొందడమే కాకుండా 'నాగార్జున సాగరం', 'కర్పూరవసంతరాయలు' ,'విశ్వనాథ నాయకుడు' మొదలు ప్రౌఢ కావ్యాలను గేయంలో రచించి, పద్యానికి గేయమే మాత్రం తీసిపోదని డా. సి. నారాయణరెడ్డి గారు నిరూపించారు. 'అజంతా సుందరి', 'వెన్నెలవాడ', మొదలైన గేయనాటికలను అధ్భుతంగా రూపొందించారు. 'నవ్వని నవ్వు' మొదలిడి జ్ఞానపీఠ' పురస్కారాన్ని సాధించి పెట్టిన 'విశ్వంభర' వరకు అనేక కావ్యాలను వెలువరించారు. నవ్యగేయ కవిచక్రవర్తిగా గేయం విలువపెంచారు. నారాయణరెడ్డి గారు తొలినాళ్ళలో రాసిన గేయాల్లో 'ఎల్లోరా గుహలు' శీర్షికన అల్లిన గేయం పేర్కొనదగింది.

> శిలలో మృదుజీవ కళలు నింపిన శిల్పి
> ఈవె రూపొందినా వెల్లోర గుహలలో
> మందహాస తుషార సౌందర్య వర్షాల
> ఎటుల కురిపించినా వెల్లోరా గుహలలో
> ...
> గాలితాకిడి చేత – కందే కపోలాల
> ఎటుల చెక్కితివయ్య ఎల్లోర గుహలలో
> నల్ల నల్లని రాతి కళ్ళలో నునుసిగ్గు
> నెటుల చిందితివయ్య ఎల్లోర గుహలలో

అని ఖండగతిలో ఎల్లోర గుహలలో గాలితాకిడికే కందిపోగల కోమలి చెక్కిళ్ళను, నల్ల రాతి నాతి కళ్లలో కదలు సిగ్గు దొంతరలను మనో హరంగా చెక్కిన శిల్పిని మనసారా కొనియాడారు. శిలలో జీవ కళల ను పలికించిన శిల్పి ఉలిని ప్రస్తుతించారు. కుల మతాలను ఎంచే కుమతులను ఆ నాడే విమర్శిస్తూ అల్లిన 'ఓ మనిషి' గేయంలో –

> వర్తమాన వలయంలో
> చిక్కుపడ్డ ఓ మనిషీ !
> భవితవ్యపు సుడిగుండం
> బారినుంచి తప్పేవా?
> కులమతాల త్రాసులోన
> తెలివిని తూచే కుమతీ !
> జ్యోతిలాంటి ఉరుమేథల
> నీ తరాజు తూచేనా?

అని కులమతాల కుటిలాత్ములను నిలదీసి ప్రశ్నించడమేగాకుండా బండలను భగవంతుడని నమ్మించి మోసగిస్తున్నారంటూ పుజార్లనూ మందలించారు. నిజాం నిరంకుశ పాలన నుంచి బయటపడి విశాలాంధ్రలో తెలంగాణా విలీనమయ్యాక ఆనందంతో అల్లిన 'రాష్ట్రావతరణం' గేయంలో

> ఆంధ్రరాష్ట్ర మవతరించెనోహో !
> అంధయుగం బంతరించె నోహో!
> నలువైపుల చీకటి నా
> గులు ప్రాకిన, ద్వేష విష
> మ్ములు దూకిన, నీల నిశా
> నిలయంలో నేటి కుష
> స్సులు లేచెనహో! సుమన
> స్సులు పూచె నహోహో !

అని అంతులేని ఆనందాన్ని పద్యాల వంటి వింత వింత విరుపుల నడకలతో గేయాన్ని నడిపారు. చీకటి అంతరించి ఆంధ్ర రాష్ట్ర అరుణోదయం అవతరించినట్లు తెలిపారు.

> నాగార్జున కొండలలో
> రాగధునులు జాలువారె
> అమరావతి గుండెలలో
> అమర కళలు సేదదీరె ||నా||

అనే శిల్ప సంపదలైన నాగార్జునకొండ , అమరావతిని, సాహితీ మూర్తులైన నన్నయాదులను , కృష్ణా-గోదావరి నదులను కొనియాడారు. మందారంలా తెలుగుమాట వికసించినట్లు వర్ణించారు. మందారం పూదేనె మధురమైంది. మిగతా పూలకంటే విరివిగా విచ్చుకునేది. కాబట్టి అటువంటి మందారంతో తెలుగు భాషా వికాసాన్ని పోల్చడం అందంగా, ఔచిత్యం ఉంది. 'వెన్నెలవాడ',

'అజంతా సుందరి','సుగాత్రి' మొదలైన గేయనాటికల్లో మధురమైన గేయాలు చోటు చేసుకున్నా ప్రస్తుతాంశమైన లలిత గీతాల్ని దృష్టి లో పెట్టుకుని వాటిని స్పృశించడం లేదు. 1955 లో 'నారాయణ రెడ్డి గేయాలు' గా వెలువడిన సంపుటిలో 'ప్రకృతి లోని ప్రణయిని' అనే గేయంలో –

చుక్కలతో నొక్కసారి
సూచింతును నా కన్నియ
నల్లని వాల్జడల సందుల
మల్లియలై మొలవాలని

అని చివరకు ప్రకృతినే తన పడతి మారిపొమ్మని ప్రార్థించడం దీని ప్రత్యేకత. తెల్లని చుక్కలను తన ప్రేయసి జడలో మల్లెలుగా, నల్లనిమబ్బులను ముంగురులుగా, శూన్యాకాశాన్ని సెచ్చెలి సెన్నడుముగా, ఎగిసే సురగంగను కొంగుగా మారిపోవాలని భావించడం మనోహరంగా ఉంది. ఈ గేయమే తరువాత 'ఏకవీర ' చిత్రం లో సినీగీతంగానూ రాణించింది .

'హేమంత విరహిణి' (పుట: 22 – 25 ) గేయంలో
నేటి చలి వేళ న –
న్నేల విదిలించితివి
జాణతనమా సఖీ !
ఓ నా పరాఙ్ముఖీ!

...

అని అలిగిన ప్రేయసిని హేమంతపు చలిలో ఏకాంతం మాని, వెచ్చని తన కౌగిలిలో కరిగి పొమ్మని ప్రాధేయ పడటం చక్కగా రచించారు. 'మిసిమి వలపు' (పుట: 26) అనే మరోగేయంలో

పృథు పయోజ భారము కం
పించిన సహియింతుగాని
పలుచని నడుమల్లాడగ
భరియించగలేను సఖీ!

...

భూగోళం లాంటి గుండ్రని భారమైన ప్రేయసి వక్షోజాలు కంపించినా సహించగలను గాని సన్నని నడుము అల్లాడితే భరించ లేనని, పద్మాల్లా పగలంతా విప్పారిన నేత్రాల్ని చూతుగాని, రాత్రి పడక గదిలో కోపంగా వాలుచూపు విరిసితే నిమిషమైనా నిలువలేనని నాయకుడు నాయికతో వాపోవడం, తన మిసిమి వలపుల్ని వెల్లడి చేయడం కొత్తగానే గాక మత్తుగా ఉంది.

'ఎగసిపో' (పుట: 33,34 ) అనే గేయంలో
ఎగసిపో ఎగసిపో ఎగసిపో!
యుగ యుగాల తమోంధ
జగతి నుల్లంఘించి
నీ కళ్ళలో వెల్గలేని యీ తారకలు
నీ గుండెలో విరియలేని ఈ చంద్రికలు
నీ చెమట తడియార్పలేని పవనోర్మికలు
బ్రతికినా చితికినా ఫలితమొకటేనోయి

అని యుగ యుగాలుగా సాగుతున్న అంధ ఛాందసాల్ని, కళ్లలో వెలుగు తారకల్ని , గుండెలో విరియని చంద్రికల్ని, చెమట పోగొట్ట లేని గాలి వీచికల్ని వదిలిపెట్టి దూరంగా వెళ్లి పొమ్మని ఎలుగెత్తారు. పిడుగులేని వానలు, మంచుకోతలు లేని హేమంతాలు,శిశిరం లేని వసంతాలు కాపురముండే చోటికి కదిలి పొమ్మన్నారు. 'జలద గీతి ' (పుట: 35 ,36 ) అనే గేయంలో వర్షించే మేఘాన్ని కడు రమణీయంగా వర్ణించారు.

సాగుమా ఓ నీల మేఘుమా !
గగన వీణా మృదుల రాగమా ! ||సా||
బీటవారిన చేల – పీయూషములు రాల
గరిక లేని పొలాల – మరకతమ్ములు తేల ||సా||

అని పచ్చని పంటలను మరకతాలతో, ప్రియురాలి వలపులను, జిల్లని పూయు మల్లికలతో పోల్చడమే కాకుండా వర్షామేఘం రాకతో ద్రవించిన కవి నవనీతమై పోవడమే కాకుండా నవ గీతమై లేవడం నవ్యంగా ఉంది. ముక్త పదగ్రస్తంలా మొదటి పాదంలోని చివరి పదాన్ని తిరిగి రెండవ పాదంలోని మొదటి పదంగా గ్రహించి, ప్రయోగించడం ఈ లలిత గీత ప్రత్యేకతగా భావించవచ్చు. అనేక సార్లు 'లలిత సంగీతం' ద్వారా 'ఆకాశవాణి' లో ప్రసారమైన కమనీయ ఖండగతి గీతమిది. డా. సి.నా.రె గారి 'తెలుగు గజళ్ళ'ను కూడా 'లలిత సంగీతం'లో కొందరు గాయనీగాయకులు గానం చేశారు. కాని అవి 'గజల్' ప్రక్రియలో చేసిన గేయ రచనలు కాబట్టి వాటిని ఈ లలితగీత పరిధిలో పరిశీలించడం లేదు. 'రామన్న','పెన్నెలవాడ' మొదలైన గేయ నాటికల్లోని గేయాలు

***Roopa Nampally - Coldwell Banker Broker Sales Associate***

**50 Princeton Hightstown Road**
**Princeton Junction 732-397-9185 (Cell)**
**Website: www.roopanampally.net**
**E-Mail: nroopa@comcast.net**

**Member of (Radha Cheerath Team).**



Buying or selling a home is one of the most important decisions you make in your life. Equally important is the right Real Estate Agent for that job.

You need a Real estate agent, like me, who has gone through formal training on an on-going basis and who will guide you through the many steps and decisions you make in the process of buying or selling a home.

Commitment to my job, superior negotiating skills, knowledge, easy accessibility, honesty, and hard work are very important to this job and those are my foremost qualities.

I will do my best to make your real estate experience as easy and as stress-free as possible.

*Internal Medicine Group*

**Board Certified**
Dr. Arvind Doshi M.D.
Dr. Priti Mehta M.D.
Dr. Sujatha Muppala M.D.

Health is the only everlasting wealth. An ounce of Prevention is worth a pound of cure

- High Blood Pressure, Diabetes and High cholesterol are "Silent Killers" and tight control will prevent heart attacks and stroke
- Hospital affiliations with St. Peter Hospital, JFK Medical Center and Princeton Hospital
- Learn the Secrets of Nutrition to achieve desired Weight Loss
- Learn about all the Cardiovascular risk factors responsible for clogging the arteries

**Office Hours:**
Monday – Friday : 9.00 AM to 5.00 PM
Saturday : 9.00 AM to 2.00 PM

5 Stanworth Road
Kendall Park, NJ 08824
Phone: (732) 297-2343

906 Oak Tree Road, Suite K
South Plainfield, NJ 07080
Phone: (908) 822-2277

కొన్ని లలిత గీతాలుగా చాలా సార్లు ఆకాశవాణి లో ప్రసారమై శ్రోతల మన్ననలందుకున్నాయి.

**కందుకూరి రామభద్రరావు (1905)** : లలితగీత లతల్ని విస్తరింపచేయడానికి కృషి చేసిన కవులలో కందుకూరి రామభద్రరావు గారు కూడ అగ్రశ్రేణిలో నిలుస్తారు. 1905లో జన్మించిన వీరు బాల్యంలో గాంధీజీ బోధనల ప్రేరణతో దేశసేవాసక్తిని పెంపొందించుకుని అనేక దేశ భక్తిగేయాలను, రవీంద్రుడు, కృష్ణశాస్త్రిగార్ల బాటలో అనేక మధుర ప్రణయ,ప్రకృతి గీతాల్ని రచించారు. వీరు ఉత్తమఉపాధ్యాయులు, ఉపన్యాసకులే గాకుండా ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో దశాబ్దం పాటు విద్యాకార్యక్రమ ప్రయోక్తగానూ ఉద్యోగం చేసి అనేక లలితగీతాలను అల్లారు.

అందులో ప్రధమంగా అగుపించే గీతం, 'తెలుగు తోట'

ఎంత చక్కనిదోయి! ఈ తెలుగు తోట
ఎంత పరిమళ మోయి! ఈ తోట పూలు
...
ఏ యమృత హస్తాల – ఏ సురలు సాకిరో ?
ఏ యచ్చరల మురుపులీ తీరుదిద్దెనో ?
ఈ పూల పాలలో నింత తీయందనము
ఈ లతల పోకిళ్ళకింత ఒయ్యారమ్ము
పాదుకొన నిండోయి ! వలపింప నిండోయి !

అంటూ మన తెలుగు రాష్ట్రాన్ని ఒక తోటగా, మధురమైన తెలుగు భాషను 'పూలపాల'నే మకరందంగా భావించారు. ఆ తోటలోనే అనవరతం తనను పాడుతూ పరవశించనీయమంటూ అర్థించారు. మాతృభాషాభిమానాన్ని ఎలుగెత్తి ప్రకటించారు. మురళీరవము' (పుట:4 ) అనే గేయంలో మురళీ కృష్ణుడిని ప్రస్తుతించారిలా –

ఆపరా ఒకసారి – ఆ మురళి రవము!
తీపి వేదన నింక – ఓపలేనుర కృష్ణా !... ||ఆ||
సుమబాల యీ బాల – సోలి వ్రాలు పదాల
ఆపి వేణువొకింత – అదుముకో నన్నెదకు ||ఆ||

అని కృష్ణుడి మోహన మురళీరవ మాధుర్యాన్ని ఓపలేనంటూ, ఇక అతని పాదాలపై సుమబాలగా సోలిపోతానంటూ, ఎదకు అదుముకొమ్మంటూ గోపిక అర్థించే తీరును రమ్యంగా రచించారు. అయితే ఈ గీతం కృష్ణ శాస్త్రి

మ్రోయింపకోయ్ మురళి
మ్రోయింపకోయ్ కృష్ణ!
తీయతేనియ బరువు
మోయలేదీ బ్రతుకు

అనే గీతాన్ని గుర్తుకు తెస్తుంది. ఆ గీత ప్రేరణతో అల్లినట్లు తోస్తుంది.

నాయెడందను రేపు నా తెలుగు తోటలో

( తమ పరిశోధక వ్యాసాన్ని "తెలుగు పాట" వ్యాస పరంపరగా తెలుగు జ్యోతిలో ప్రచురించుకోవడానికి అనుమతినిచ్చిన రచయిత శ్రీ వడ్డేపల్లి కృష్ణ గారు ప్రముఖ సినీ రచయితగా తెలుగు నాట లబ్ధ ప్రతిష్టులు. వారికి తెలుగు జ్యోతి తరఫున మా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ ధారావాహికం ఇక్కడితో ఆపుతున్నాం. – సం.)

## అ - పరిచిత

డా. ఊటుకూరి విజ్ఞానేశ్వర కుమార్

ఎప్పుడూ ఒకే పరిసరాల్లో మనకి కనిపించే వాళ్ళు మరోచోట కనిపిస్తే నాకు చప్పున వాళ్ళెవరో అర్థం కాదు. కాఫీ షాపు కార్ల్ కానీ మా మంగలి వాడు మైక్ కానీ బయటెక్కడైనా కనిపించి హాలో అంటే ఎవరబ్బా అని బుర్ర గోక్కోవాల్సొస్తుంది. అది నా పరధ్యానం అంటుంది మాఆవిడ. కావచ్చు కాదనను. కానీ మొన్నో రోజు తారుమారయింది నా జ్ఞాపకం పరిస్థితి. పరిగెత్తే కాలం నన్ను ముసలాళ్ళాఫీసు వేపు నడిపించిందో రోజు. తీరా వెళితే అక్కడ చాంతాడంత లైను నత్త నడక నడుస్తూ కనిపించింది. లాభం లేదని వెనక్కొచ్చి అపాయింట్మెంట్ కోసం ఫోన్చేస్తే నవ్వుేందక్కడి పడుచు పిల్ల, ఈఆఫీసులో ఆపద్ధతి లేదన్నది. మరేమి శరణ్యమంటే చిట్కా చెప్పింది, ఆఫీసు తెరవడానికి అరగంట ముందొచ్చి నిలబడూ నీ ముందు మరెవ్వరూ ఉండరూ అని. బావుందని అలాగే వెళ్ళాను

WE COULDN'T BE MORE EXCITED ABOUT THIS MESSAGE

**Yes**, WE ARE GROWING

**Yes**, WE ARE HIRING

Even in this economy

To Find Out How You Can Bring Your Career to LIFE Contact me Today



**Thevan Theivakumar**, CLF®

Sr. PARTNER, New Jersey Sales Office

**(732) 744-3763**

ntheivakuma@ft.newyorklife.com

**www.ThevanTheivakumar.com**

EOE.M/F/D/V

WE STAND STRONG | JOIN OUR TEAM | NEW YORK LIFE

The Company You Keep®

New York Life Insurance Company 399 Thornall Street, 7th Floor Edison, NJ 08837

తరువాతి వారం. మంచి సలహానే అనిపించింది, నా ముందో చైనీసాయన మాత్రమే ఉన్నాడు, నా వెనక మెల్లి మెల్లి గా లైను పెరగడం మొదలైంది. ఇంతలో అటూ ఇటూ తిరుగుతూ సెల్ ఫోన్ మీద నిర్విరామంగా మాట్లాడుతూ ఒకావిడ కనిపించింది. ఆ దర్జా ఏమిటీ లైనులో నిల్చోకుండా ఆ పచార్లేమిటీ అనుకున్నాను. మెల్లిగా అర్థమైంది ఆవిడా చైనీసే, అయన్ని లైన్లో నిలపెట్టి తనేమో ఎవరికో గాఠ్ఠిగా క్లాసు తీసేసుకుంటోంది ఫోను మీదా అని. నవ్వుకున్నాను కానీ ఎందుకో మాటిమాటికీ ఆవిడ వేపు చూపు తిరిగింది, అదే చలాకీ మొఖం, అదే చురుకైన నడక అనిపించ సాగింది. ఏమిటేమిటి ఆవిడెవరూ ఏమా కథా అని నా మనసుని నేనే ప్రశ్నించుకున్నాను. ఇప్పుడు కాదు ఓ ఇరవై ఏళ్ళ క్రితం సంగతి. ఆఫీసు నుంచి రాగానే, షాప్ రైట్ కి వెళ్లి వంటకి కావాల్సిందొకటి అర్జంటు గా తెచ్చి పెట్టరా ప్లీజ్ అని అర్థించింది అర్ధాంగి. నీరసంగా వెళ్లి నాపని లో నేనుండగా హలో అని నవ్వుతూ చాలా పరిచయమున్నట్లుగా పలకరించిందొకావిడ. చైనీసావిడా- పక్కన ఓ పదేళ్ళ కూతురుతో ఉన్నదీ ఎవరో అర్థంకాలేదు. మాకు చైనా వాళ్ళెవరూ తెలియదు. హలో అని ముక్తసరి గా సమాధానం చెప్పి శ్రీమతి క్కావలసిన రంగూ-రుచీ-వాసనా-పరిమాణంగల ఆ వస్తువెక్కడుందో వెతుకుడులో పడిపోయాను. ఆవిడ వెంటనే కూతురిని దగ్గరికి తీసుకుని తల మీద ముద్దు పెట్టుకున్నది. అప్పుడు అంతగా దాన్ని గురించి ఆలోచించలేదు. పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకోలే అనుకున్నాను. తరువాత కొన్నాళ్ళకెప్పుడో వినాయక చవితి పూజ కి వేసుకున్న సిల్కు లాల్చీ పైజామా డ్రై-క్లీనింగ్ చేయించడంకోసమని లాండ్రీలోకడుగుపెట్టుండగా చటుక్కున తట్టింది, షాప్ రైట్-లొ హలో అన్నావిడా వాళ్ళాయనా ఆ లాండ్రీ నడుపుతారూ, ఆ రోజుకో కొన్నాళ్ళ ముందు ఆ లాండ్రీకి వెళ్ళాను, అప్పుడు "మీరు ఇండియన్లా", అంటూ నవ్వుతూ పలకరించి మాట్లాడిందావిడా అని. అప్పుడర్థమైంది, అంటీ ముట్టని నా సమాధానానికి నొచ్చుకుని తనకి జరిగిన అవమానం కూతురికి తెలియకుండా ఉండాలని కూతురిని దగ్గరికి తీసుకుని తల మీద ముద్దు పెట్టుకున్నదన్నమాట ఆ రోజూ అని. "క్షమించమ్మా ఎవరు మీరూ నాకు గుర్తు రావడం లేదూ" అని అడిగే మర్యాద లేకపోయింది కదా నాకా రోజు అనిపించింది. ఇవాళ తప్పకుండా ఆవిడకి క్షమాపణ చెప్పుకోవాలీ అనుకున్నాను కానీ ఆవిడ లేదక్కడ, షాపు అమ్మేశారట. మళ్ళీ ఎక్కడా ఆవిడ తారసపడలేదు, ఆ సంఘటన బుఱ్ఱలో వెనకాల పడిపోయింది.అంతా ఫ్లాష్ బాక్ లా తిరిగి గుర్తొచ్చింది. వెళ్లి పలకరిద్దామా మీరు ఫలానా ఊళ్ళో లాండ్రీ నడిపే వాళ్ళా అననుకున్నాను కానీ, ఛా ఛా, ఖరీదైన స్వెట్టరూ షూసూ వేసుకునున్న ఆ సంపన్న కుటుంబీకురాలిని "మీరు పాతకాలంలో చాకలి షాపు నడిపేవారా" అని అడగడం బావుండ


**With Best Compliments from:**

Cosmic
Stone & Tile Distributors

502 (formerly 475) Jersey Avenue, New Brunswick, NJ 08901
Tel: (732) 937 5400 Fax: (732) 937 6969 www.cosmicstone.com

*Wholesale distributors of:*

*Slabs & Tiles:*
Granite, Marble, Onyx
Glass & Jade
Limestone, Travertine & Quartzite
Silestone

*Tiles:*
Polished Porcelain & Glazed Porcelain
Ceramic & Concrete
Limestone & Travertine
Engineered Stone

*New Jersey's Sole Distributor for:*
SILESTONE

*Also available are beautiful mosaics, chair rails, bullnose and medallions!*

దూ, నా జ్ఞాపకం తప్పైతే మరీ నామర్దాగా ఉంటుందీ అనిపించింది. అంతే కాదు నేను అన్నిమాట్లు ఆవిడ వేపు రాడార్ స్కానింగ్-లాగా చూసినా, ఈయనెవరూ నా వేపు ఎందుకు చూస్తున్నాడూ అని ఒక్క మారు కూడా నావంక చూడ లేదావిడ, "ఆ రోజు నన్ను గుర్తించకుండా అవమానించిందీ మహానుభావుడే" అని నన్ను కూడా తను గుర్తెంచిందో ఏమిటో. ఇంతలో ఆఫీసు తలుపులు తెరిచాబు. నా పని పూర్తి చేసుకుని నేను రోడ్డెక్కాను. కానీ ఆ ఘటన మాత్రం జ్ఞాపకంలో అలా నిలిచిపోయింది.

## అతిథి దేవో భవ!

శ్రీ గవరసాన సత్యనారాయణ

వేళపాళ లేకుండా ఎవరైనా ఇంటికి వస్తే, వారిని అతిధులు (చెప్పా పెట్టకుండా వచ్చేవారు) గా చెప్పుకోవచ్చు. ఫలాన తిధిని (రోజు) వస్తాను అని చెప్పేవాడు తిధి. ముందే ఫోను చేసి, లేక ఈ-మెయిలు పంపి, ఫలానా రోజున వస్తాను అని చెప్పేవారిని తిధిలు (అపాయింట్మెంట్ తీసుకుని వచ్చేవారు)గా లెక్కపెట్టుకోవచ్చును. తిధిలు పదిహేను గదా! పాడ్యమి, విదియ, తదియ, చతుర్దశి ... అమావాస్య లేక పౌర్ణమి. ఋషుల కాలములో చదువుకోవటానికి, ఉపనయనము అయిన తరువాత ఆశ్రమానికి విద్యార్ధులను పంపేవారు. ఇంగ్లీషు వాళ్ళు బడులు ఏర్పాటు చేసిన తరువాత, బీద పిల్లలు వారాలు చేసుకుని చదువుకునేవారు. వారాలు అంటే ఫలానా రోజున ( ఆదివారం, సోమవారము, ... ఇట్లా ) విద్యార్ధి భోజనానికి వస్తాడు అని గృహిణి గ్రహించి, ఆరోజున విద్యార్ధికి భోజనం వండేది. అమెరికా నుండి వచ్చిన తరువాత, ఒక ఆసామి, మా ఊరు గొల్లప్రోలు రైలు స్టేషనుకి స్టేషను మాస్టారుగా వచ్చాడు. మమ్మల్ని ఆయన ఇంటికి తీసుకుని వెళ్ళి, గౌరవ మర్యాదలు చేసి, ఓ విషయాన్ని చెప్పాడు. ఆయన గొల్లప్రోలు లో చదువుకునేటప్పుడు మామామగారి ఇంటికి ప్రతి మంగళ వారము వచ్చి, భోజనము చేసేవాడట. ఇప్పుడు వారాల పద్ధతి లేదు. బీదవిద్యార్ధులకు ఉండటానికి, తినటానికి, హాస్టల్స్ ఉన్నాయి.ఇంతకుముందు, అంటే 1947 సంవత్సరానికి ముందు, మనల్ని పాలించిన వారు బ్రిటిషు వారు. ఆ బ్రిటిషు వారి దేశము లో బీద విద్యర్ధుల సంగతి ఏమిటీ అనే ప్రశ్న వచ్చింది. బ్రిటనులో బీదపిల్లలు తల్లి తండ్రులకు సాయం చేసి ఆయావృత్తి విద్యలను నేర్చుకునేవారు. ధనికుల పిల్లలు ఇంటి వద్దే ట్యూటర్ల సాయంతో రాయటం, చదవటం, లెక్కలను చేయటం నేర్చుకునేవారు. మత బోధకులు చర్చీలో పాఠాలు నేర్పేవారు. కాలంతో పాటు మార్పులు వచ్చి, బ్రిటనులో, 1899 సంవత్సరములో, అందరూ కంపల్సరీగా 12 సంవత్సరాలు వచ్చేవరకు బడిలో చదువు కోవాలని శాసనం చేసారు. ఆనాటి పరిస్థితి భారతదేశములో ఎలాగున ఉందో జె. యెస్. కాటన్ గారు బ్రిటనులోని ఉభయ పార్లమెంటు సభలకు 1892-93, 1896-97 సంవత్సరాలలో భారతదేశములో చదువుల గురించి రిపోర్టును సమర్పించారు. మగపిల్లల బడిలో, క్లాసుకి ముప్పై మంది ఉంటే ఆడపిల్లల బడిలో 40 మంది ఉండేవారు. ఆనాటి భారతదేశములో చదువుల విషయము తెలుసుకోవాలి అంటే జె. యెస్. కాటన్ గారు రాసిన రిపోర్టును చదవాలి. మన దేశములో, కొన్నిగుడులలో ఇప్పటకీ వేదపాఠశాలలు నడుపుతున్నారు. భారతదేశములొ నిర్బంధ విద్యను 14 సంవత్సరాలకు పెంచారు.

అతిథి దేవో భవ! ఈవాక్యము ఎక్కడ నుండి వచ్చింది? తైత్తిరీయ ఉపనిషద్ లో 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ' అని ఉంది. తైత్తిరీయ ఉపనిషద్ ఈనాటిది కాదు. క్రీస్తుకు పూర్వం 500 లేక 600 సంవత్సరాల ముందో రాసినది. శంకరాచార్యులవారి పుణ్యమా అని తైత్తిరీయ ఉపనిషద్ ను ఇప్పుడు చదువగలుగుతున్నాము. ఇప్పటికీ పల్లెలలో ఎవరైనా కొత్తవారు ఇంటికి వస్తే వారిని సాదరముగా ఆదరిస్తారు. అది భారతీయ ప్రత్యేకత! ఇప్పుడు మనం అమెరికా లో నివసిస్తున్నాము. భారతదేశమునుండి వలస వచ్చినవాళ్ళం. మనం తైత్తిరీయఉపనిషద్ లో రాసినట్లు నడుచుకోవాలా? మన సంస్కృతిని నిలబెట్టుకోవాలి అంటే మన పురాణాల్లో రాసినవి ఆచరించాలా? అతిథి దేవో భవ! అని వేళ పాళ లేకుండా ఎవరైనా ఇంటికి వస్తే, వారిని ఆదరించాలా? ఇవన్నీ ప్రశ్నలు. అమెరికాలో నివసిస్తున్న తెలుగువారి ఇంటికి రెండు రకాల మనుషులు

వస్తారు. ఇండియా నుండి వచ్చే బంధువులు, అమెరికాలో ఉన్న మిత్రులు. భార్యా భర్తలు ఇద్దరు ఉద్యోగాలకు పోతారు. పిల్లలు డే కేర్ కో, బడికో, పోతారు. తిథులుగా వస్తే తలుపు తీసి ఇంటికి రమ్మనవచ్చును. అతిథిలుగా వస్తే అంతే సంగతి. ఇంటికి తాళం వేసి ఉంటుంది. ఇంటికి ఎవరైనా కొత్తవారు వస్తే దొంగో, దొరయో గృహస్తుకు ఎలా తెలుస్తుంది? ఫ్లోరిడాలో అనుకుంటాను, ఒకాయన దారితప్పిపోయి తనఇంట్లోకి వచ్చిన కుర్రవాడిని తుపాకితో కాల్చి చంపినట్లు గుర్తు. తుపాకితో కాల్చినవాడికి శిక్ష పడలేదు. ఇంటికి ఎవరైనా వచ్చి అఘాయిత్యము చేస్తే వారిని చంపినా తప్పు లేదు అని ఈ న్యాయసూత్రము చెపుతున్నది. స్వరక్షణ కోసం ఎదటివానిని చంపినా, న్యాయ శాస్త్రము ప్రకారం, శిక్ష లేదు. అమెరికాలో 50 రాష్ట్రాలు ఉండగా అందులో 24 రాష్ట్రాలలో ' స్టేండు యువర్ గ్రౌండు' 'షూట్ ఫస్ట్ ' వంటి చర్యలకు ప్రాణముపోయినా శిక్ష లేదు. ఇది అమెరికా. ఇక్కడ మన ఇళ్ళకు 'అలారంలు' వేయించికుంటున్నాము. ఎవరైనా కొత్తవారు వస్తే, తలుపు తీసేముందు, తలుపులో అమర్చిన చిన్న కంతనుండి చూసి, తలుపును తీస్తున్నాము. కొన్ని ఇళ్ళళ్ళో వచ్చిన వారితో ఎందుకు వచ్చారు అని అడిగి, విడియోలో చూసి, విషయము తెలుసుకుని, తలుపు తీస్తున్నాము. కొన్ని ఇళ్ళళ్ళో నాలుగు మూలలా కెమెరాలు బిగించి, ఆ విడియోను రికార్డు చేసి, ఎవరు వచ్చింది తెలుసుకుంటున్నాము. ఎందుకు? ఎవరైనా కొత్తవారు చెప్పకుండా మనఇంటికి వస్తే (అతిథి గా) వారికి, ఇన్ని అడ్డంకులు కల్పించాలి. అందుకే అమెరికాలో ఎవరూ ముందు ఫోను చెయ్యకుండా స్నేహితుల ఇంటికి పోరు. ముందు చెప్పకుండా ఎవరైనా ఇంటికి వస్తే వాడిని 'అతిథి దేవోభవ' అని గౌరవం చేయరు. అతిథి దేవో భవ! అన్న సూక్తి అమెరికాలో చెల్లుబడి అవుతుందా?

References:


1. http://en.wikipedia.org/wiki/Atithi_Devo_Bhav
2. http://www.localhistories.org/education.html
3. Progress of education in India - 1892-93 to 1896-1897.
4. https://www.mtholyoke.edu/courses/rschwart/hist151/India/Education%20in%20India%201892-1897.pdf
5. http://en.wikipedia.org/wiki/Castle_doctrine
6. http://www.propublica.org/article/the-23-states-that-have-sweeping-self-defense-laws-just-like-floridas


## తమ్ముడి విషాదయోగం

డా. గిరిజా శంకర్ చింతపల్లి

**కురుక్షేత్రం**

అర్జునుడు నిర్వీర్యుడైనాడు. "బావా! యుద్ధం చెయ్యను. తాతనూ, గురువునీ, అన్నదమ్ములనీ చంపి నెత్తుటికూడు తినలేను" "ఇంత పిరికివాడివా అర్జునా! చంపేవాడెవడు? చచ్చేవాడెవడు? అంతా నీ భ్రమ. ఉత్తిష్ఠ. కురు కర్తవ్యం" అని కృష్ణుడి ఎత్తి పొడుపు. ఆ యుద్ధం ఎలా ముగిసిందో అందరికీ తెలుసు. అది ద్వాపర యుగం.

**ఇపుడు కలియుగం.**

ఏదేశం ఏదేశంతో విరోధిస్తున్నదో తెలియదు. "Politics make strange bed fellows" అంటే "క్షణక్షణముల్ ప్రభు జవరాండ్ర చిత్తముల్" అన్నమాట. జనులు పరాయి దేశాలకి విచ్చలవిడిగా వలస వెళ్తున్నారు. అలా వలస వచ్చినవాళ్ళలో "ఆ" దేశాన్నించి "ఈ" దేశానికి వచ్చాడు ఒక తమ్ముడు. పైచదువులకని నెపం. వచ్చాక "ఈ" దేశంలోని సుఖాలకి బాగా అలవాటుపడి మళ్ళీ, జన్మనిచ్చిన "ఆ" దేశానికి వెళ్ళలేదు. ఇక్కడ సిటిజన్ అయితే నేగానీ "ఈ" దేశంలో ఉండనివ్వమని ప్రభుత్వం ఉత్తరువు. దానికి ప్రధాన ఘట్టం – పౌర ప్రమాణస్వీకారం. ఈ సిటిజెన్-షిప్ ఓత్ సెర్మనీలో "ఈ దేశ రక్షణకోసం అవసరమైతే ఆయుధాల్ని ధరించి, ఈ దేశానికి శత్రువులైనవాళ్ళతో యుద్ధంచేసి ఏ దేశస్థుల్నైనా చంపడానికి వెనుదీయన"ని తమ్ముడి ప్రతిజ్ఞ. కాలం కలిసి రాలేదు. "ఈ"దేశానికీ, "ఆ" దేశానికీ యుద్ధం రానే వచ్చింది. తమ్ముణ్ణి - "ఈ"దేశం తన్ని ఆయుధాలు ధరించమని ఆదేశించింది. "ఆ" దేశంతో యుద్ధం చెయ్యమంది. కురుక్షేత్రానికి పంపించింది. "ఆ" దేశం కూడా అలాగే అక్కడి ప్రజలందరికీ

అన్నతో సహాఆయుధాలిచ్చి "ఈ" దేశాన్ని మటుమాయం చెయ్యమని ఆదేశమిచ్చింది. "ఆ" దేశం సైన్యంలో "అన్నయ్య". "ఈ" దేశం సైన్యంలో "తమ్ముడు". ఇదో మోడరన్ కురుక్షేత్రం. తమ్ముడికి విషాదయోగం. "ఆ" దేశం తన మాతృభూమి. జన్మనిచ్చిన తల్లి ... ఎదురుగ్గా "ఆ"అమ్మగన్న అన్నయ్య. "అమ్మ"లొ "అ", నాన్నలొ "న్న" – ప్రోది పుచ్చుకున్న అన్న. ఎలా యుద్ధంచెయ్యాలి? ఎలా అన్నయ్యని చంపడం? కృష్ణుడులేడు. ఎవర్నడగాలి?

తమ్ముడికి సలహా ఇచ్చే "నాథుడు" లేడు. భగవద్గీత లేదు. తమ్ముడు విషాదం భరించ లేకపోయాడు."ఈ" దేశమిచ్చిన ఆయుధముంది. ఆయుధానిదేముంది? ఎటు పేలిస్తే అటు పేలుతుంది. ఒక వైపుకే పేలే తుపాకీ ఇంకా కనుక్కోలేదు. "ఇటు", తనకేసి తెప్పి ఆయుధం తిప్పి పేల్చాడు. తమ్ముడు (తనే) మరణించాడు. ఆత్మహత్య! నరకానికి పోతాడా? పోతే పోతాడు. అన్నయ్య క్షేమంగా ఉన్నాడు. అదే చాలు.

## థాంక్యూ రా.వి.శాస్త్రీ !

డా. వై. వి. రమణ, గుంటూరు (ఇండియా)

సమయం రాత్రి పన్నెండు గంటలు, నిద్ర రావట్లేదు. పక్కన పడుకునున్న నా భార్య ఏదో మెడికల్ జర్నల్ చదువుకుంటుంది. రోజూ ఈ సమయంలో జాతీయ, అంతర్జాతీయ సంఘటనలపై ఏదోటి తీక్షణంగా చదువుతూ, తీవ్రంగా ఆలోచిస్తూ, అంతకన్నా తీవ్రంగా నిట్టూరుస్తూ వుంటాను. తరవాతేం చేస్తావు? అబ్బే! పెద్దగా ఏమీ చెయ్యను, అలసిపొయ్యి నిద్ర పోతాను, అంతే!

రోజుట్లా వార్తలు చదివి నిట్టూర్చడానికి ఇవ్వాళ మూడ్ బాలేదు. పక్కనున్న టీపాయ్ మీద 'రావిశాస్త్రి రచనాసాగరం' వుంది. పుస్తకం అట్టమీదనున్న రావిశాస్త్రి రంగుల బొమ్మ నవ్వుతూ నన్ను పలకరిస్తున్నట్లనిపించింది. రావిశాస్త్రికి రెండు చేతులు జోడించి దణ్ణం పెట్టుకుని (నాకు దేవుడి మీద నమ్మకం లేదు గానీ రావిశాస్త్రి మీద నమ్మకముంది), ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాను. చేతికొచ్చిన ఒక పేజీ ఓపెన్ చేశాను.

వావ్! నా ఫేవరెట్ 'రాజు - మహిషి' వచ్చింది. గేదెల రాజమ్మ, బావ గంగరాజుతో కలిసి బంగారి కిళ్ళీకొట్టు ముందు ... కర్రిముండని (అమ్మలు), కమ్మలింటి రాజుని (భవానీ శంకర ప్రసాద్) రొట్లప్పిగాడి సాక్షిగా తన్నిన ఘట్టం. ఈ చాప్టర్ మొత్తం ఒకేఒక్క పేరాగ్రాఫ్‌లో పీనుగ్గుమాస్తాతో ఉపన్యాస ధోరణిలో చెప్పిస్తాడు రావిశాస్త్రి. ఇదో ఎపిక్ పేరాగ్రాఫ్. ఎన్నిసార్లు చదివినా మళ్ళీ చదవాలనిపిస్తుంటుంది. కావున - చదవసాగాను. "పొద్దస్తమానం ఆ రావిశాస్త్రినే చదువుతారు! బోర్ కొట్టదా?" నా భార్య ప్రశ్న విని తల పక్కకి తిప్పాను. "ఏమో మరి! అస్సలు బోర్ కొట్టట్లేదు, పైగా రోజురోజుకీ ఇష్టం పెరిగిపోతుంది కూడానూ." నవ్వుతూ అన్నాను.

నేను అనేక సంవత్సరాలుగా తెలుగు సాహిత్యంలో కొత్తగా ఏదీ చదవలేదు. ఎందుకు? 'సమయం లేదు' అంటూ అబద్దాలు రాసుకోడానికి ఇదేమీ నా ఆత్మకథ కాదు కదా? కావున నిజాయితీగా ఈప్రశ్నకి సమాధానం రాయడానికి ప్రయత్నిస్తాను.

జీవిక కోసం తప్పించి, ఏ మనిషీ కూడా తనకి నచ్చని పని చెయ్యడాని నా నమ్మకం. నాకు రావిశాస్త్రి రచనలు ఇష్టం. కావున అవే చదువుతుంటాను. రావిశాస్త్రి అన్నేసి కథలు, అన్నేసి పేజీలు రాశాడు కదా? ఎందుకు? తనెందుకు రచనలు చేస్తున్నానో రావిశాస్త్రి చాలా స్పష్టంగానే చెప్పాడు. ఆయన ఎందుకోసం రాశాడో ఆ ప్రయోజనం నెరవేరిందా? ఆయన ఎవరి కోసం రాశాడో వాళ్ళు ఆయన సాహిత్యం చదువుతున్నారా? చదివినట్లైతే వారిపై ఆయన ప్రభావం ఎంత? ఇత్యాది విషయాలు ఆలోచించి బుర్ర పాడు చేసుకోను.

మొన్నెక్కడో చదివాను 'రావిశాస్త్రి భవిష్యత్తరాలు కూడా స్మరించుకునే గొప్ప రచయిత.' అని. నాకు నవ్వొచ్చింది. రావిశాస్త్రిని ఎవరు, ఎందుకు, ఎప్పటిదాకా చదువుతారో మనమెలా చెప్పగలం? ఏ రచనైనా మారుతున్న సమాజానికి రిలెవెంట్ గా వుంటే నిలబడుతుంది, లేకపోతే లేదు. ఈ ముక్క రావిశాస్త్రే చెప్పాడు. నేను మాత్రం గత కొన్నేళ్ళుగా రావిశాస్త్రి రచనల్ని పూరీ పిండిలాగా పిసికేస్తున్నాను!

ఒకసారి నా మిత్రుడు అన్నాడు. 'ఒక సినిమా గానీ, రచన గానీ ఒకసారి ఎంజాయ్ చేస్తే రెండోసారి చెయ్యలేం.' అతని అభిప్రాయం కరెక్టు కావచ్చు. కానీ - అన్నిసార్లు కాదు. షెర్లాక్ హోమ్స్ నవల, హిచ్‌కాక్ సినిమా రెండోసారి ఎంజాయ్ చెయ్యలేక పోవచ్చు. కానీ - సోమర్సెట్ మామ్ ని ఎన్నిసార్లైనా చదవొచ్చు, 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్' ని ఎన్నిసార్లైనా చూడొచ్చు. ఇంకా చాలా పన్లు చాలాసార్లు చేసినా బాగానే ఎంజాయ్ చెయ్యొచ్చు.

చిన్నప్పుడు అమ్మ వంట చేస్తుంటే పక్కన కూర్చుని గమనిస్తుండేవాణ్ని. కొన్ని నిమిషాల వ్యవధిలో ఒక పదార్థం తినడానికి పనికొచ్చేవిధంగా తయారైపోవడంఅనే అద్భుతాన్ని ఆశ్చర్యంతో గుడ్లప్పగించి చూస్తుండి పొయ్యేవాణ్ని. ముఖ్యంగా - అమ్మ చక్రాలు చేసేప్పుడు చూస్తూ కూర్చోటం నాకెంతో ఇష్టం. చక్రాల గిద్దల్ని నొక్కుతుంటే కింద గిద్ద రంధ్రాల్లోంచి సన్నగా, మెత్తగా, ధారగా, దారంలా వచ్చే శెనగ పిండి - మరుగుతున్న నూనెని తాకంగాన్లే 'సుర్రు'మని శబ్దం చేస్తూ, హడావుడిగా నూనెలో అటూ ఇటూ పరిగెట్టడం చూస్తే గమ్మత్తుగా వుండేది. నేను కూడా చక్రాల గిద్దల్ని ఒత్తుదామని ప్రయత్నించేవాణ్ని గానీ, నా బలం సరిపొయ్యేది కాదు. నాకు చక్రాల రుచి కన్నా, అవి వండిన విధానం ఎంతగానో ఇష్టం. అలాగే - చిన్నప్పుడు తిరుపతి చాలాసార్లు వెళ్లాను. రెండు మూడు కుటుంబాల వాళ్ళం కలిసి వెళ్ళేవాళ్ళం కాబట్టి మా పటాలం పెద్దది. ముసలీ ముతకా, కొందరు సుకుమారులు కొండపైకి కార్లల్లో వెళ్లిపొయ్యేవాళ్ళు. నేను మాత్రం నడక బ్యాచ్‌లోనే వుండేవాణ్ని. ఆ అడవి, కొండలు, గుట్టలు, లోయలు, రాళ్ళూ రప్పలు, కోతుల గుంపులు, కాళ్ళ నొప్పులు ... నాకు చాలా ఇష్టం. నా మటుకు నాకు తిరుపతి ట్రిప్ అంటే ఇంతే! దేవుడి దర్శనం చప్పగా (ఒక్కోసారి విసుగ్గా) అనిపించేది.

అమ్మ చేసిన వంట రుచి నాకు ముఖ్యం కాదు. తిరుపతి దేవుడి దర్శనం నాకు ప్రధానం కాదు. అలాగే - రావిశాస్త్రి రచనల్లో 'కథ' నాకు అనవసరం. నేను దాన్నెప్పుడూ పట్టించుకోలేదు, ఇకముందు పట్టించుకోను కూడా. నాకు రావిశాస్త్రి వాక్యం ఇష్టం, అక్షరం ఇష్టం, ఆయన రాసే స్టైల్ ఇష్టం. ఒకవేళ - రావిశాస్త్రి తను షేవింగ్ చేసుకునే విధానం గూర్చి రాసినా చదవడానికి నాకు ఆసక్తిగానే వుంటుంది. కొందరు కథావస్తువు, శిల్పం అంటూ ఏవో చెబుతారు గానీ.. నాకవేవీ అర్ధం కావు, అనవసరం కూడా. అయినా - అందరికీ అన్నీ నచ్చాలని రూలేమీ లేదు కదా? ఈమధ్య ఒకళ్ళిద్దరు నన్ను విసుక్కున్నారు, ఆ ఒకళ్లిద్దరూ నా


This Page is sponsored by Pediatric and adolescent Care Associates

Pediatric and Adolescent Care Associates

Ravi S. Chennapragada, MD, FAAP

*Board Certified in Pediatrics*
*Experienced and individualized care*

Daytime, evening, or weekend appointments available

*On call 24 hours a day, 7 days week for emergencies*
*Free pre-natal consultation*
*Most insurance plans accepted*

Attending pediatrician at:
*Robert Wood Johnson University Hospital ▪ St. Peter's Medical Center*
*JFK Medical Center ▪ Somerset Medical Center*

*▪ Two convenient locations ▪*

*676 Route 202-206 North, Building 2*
*Bridgewater, New Jersey*
*(908) 927-1155*

*1667 Oak Tree Road*
*Edison, New Jersey*
*(908) 927-1155*

శ్రేయోభిలాషులే!

'నీ గూర్చి నువ్వెప్పుడైనా ఆలోచించుకున్నావా? నీదంతా గుడ్డెద్దు వ్యవహారం. ఏదో ఒకదాన్ని ఇష్టపడతావ్. ఇంక అందులోనే కూరుకుపోతావ్. పైగా అదే స్వర్గం అనుకుని మురిసిపోతుంటావ్! నీ రావిశాస్త్రి అభిమానం వ్యసన స్థితికి చేరుకుంది, అందులోంచి అర్జంటుగా బయటకి రా! ఈ ప్రపంచం చాలా పెద్దది, కళ్ళుండి చూడాలే గానీ చాలా సుందరంగా వుంటుంది.' నాకు మొండి కత్తితో గుండెల్లో పొడిచినట్లు అనిపించింది. తెలుగు సినిమా హీరో అభిమానుల సరసన నించున్నంత అవమానంగా కూడా అనిపించింది. అవున్నిజమే! నేనెప్పుడూ ఈ కోణంలో ఆలోచించలేదే! నేనేమన్నా రావిశాస్త్రికి బానిసనా? ఆయనకేమన్నా అప్పున్నానా? అక్కటా! ఏల నేనిన్నాళ్ళూ బావిలో కప్పలా, బురదలో పందిలా, సందులో కుక్కలా జీవించితిని? నా హృదయం తడిసిన సిమెంటు బస్తాలా బరువుగా అయిపొయింది. ధృతరాష్ట్రుడికంటే కళ్ళు కనిపించవు, ఆయనకి వేరే చాయిస్ లేదు. మరి ఆ పక్కన గాంధారి కళ్ళకి గుడ్డెందుకు కట్టుకుంది? గాంధారి భర్త కోసం కళ్ళగుడ్డ కట్టుకుని (పాతివ్రత్యాన్ని పాటించి) ఎంతోకొంత పుణ్యం సంపాదించి వుండే వుంటుంది.. రావిశాస్త్రి వల్ల నాకాపాటి పుణ్యం కూడా లభించదు కదా! కావున ఇకముందు నేనిలా వుంటానికి వీల్లేదు. వీరేశలింగం వితంతువుల్ని సంస్కరించినట్లు, నన్ను నేను సంస్కరించుకోవలసినదే! అసలు తెలుగు సాహిత్యమన్న ఒక పవిత్ర జీవనది వంటింది. దాన్ని మనసారా చదివి ఆనందం పొందవలె! సీతాకోక చిలక అనేక పుష్పములపై వ్రాలి మకరందము గ్రోలుట నీవు కాంచలేదా? ఏం - ఆ కీటకం ఒక పువ్వు మీదే వాలి కడుపు నింపుకోవచ్చు కదా? కానీ - ఆ సీతాకోక చిలక అన్నిరకాల పూలపై వ్రాలుతూ మకరందం కుంచెం కుంచెం రుచి చూస్తూంటుంది. దీన్నే సమన్వాయం అంటారు! అర్ధమైందా? అయ్యో! ఒక అర్భక సీతాకోక చిలక్కి వున్నంత పాటి బుర్ర నాకు లేకపోయేనే! తప్పదు.. తక్షణమే తెలుగులో రాస్తున్న యితర రచయితల సాహిత్యపరిమళాన్ని అఘ్రాణించెద, తేనేవలే స్వీకరించెద, చింత లూరివారి మాదీఫలరసాయనము వలె నాకి వేసెద, నూజివీడు రసం వలె జుర్రుకొనెద, అమూల్ ఐస్క్రీం వలె చప్పరించెద.

నా స్నేహితుల సలహా మేరకు, పుస్తకాల షాపు కెళ్ళి, ఈ మధ్య కాలంలో తీవ్రమైన పేరు ప్రఖ్యాతులు పొందిన మాంచి జమాజెట్టీల్లాంటి రచయితల పుస్తకాలు కొన్నాను. ఉత్తమ పాఠకుని లక్షణమేమి? పుస్తకం 'కొని' చదవటం. పుస్తకం కాజేసో, అరువు తెచ్చుకునో చదివిన వాడు పాఠకుడో, పాతకుడో అగును కానీ.. ఉత్తముడు మాత్రం కాజాలడు.

ఒక చల్లని రాత్రి (వాస్తవానికి అది చల్లని రాత్రి కాదు, ఎండాకాలపు వెచ్చని రాత్రి, ఏసీ వల్ల గది లోపల మాత్రమే చల్లగా వుంది, కానీ - అనాదిగా తెలుగు కవులు వెచ్చని రాత్రిని శృంగార విషయాలకి మాత్రమే రిజర్వ్ చేసి ఉంచారు) పుస్తకం తెరిచి చదవడం మొదలెట్టాను. ఒక పేజీ ఏదో చదివాను. రెండో పేజీ కష్టపడి చదివాను. మూడో పేజి చదువుతుంటే ఎంతకీ కదలట్లేదు! ఔరా! ఏమి ఈ మాయ! రాత్రికి రాత్రులు దిండ్ల కన్నా మందమైన, బండరాయి కన్నా బరువైన పుస్తకాల్ని 'ఉఫ్'మని ఊది పారేసిన నాకు పేజి కదులుట భారమగుటయా! ఏమి ఈ కాలమహిమ! కష్టపడి మూడో పేజి కూడా చదివాను. నాలుగో పేజి మొదట్లోనే ఇంజన్ మొరాయించింది. ఎన్నో యేళ్ళుగా ఎంతోమందికి కౌన్సిలింగ్ చేశాను. పీనుగల్లాంటి వాళ్ళు ఏనుగుల్లాగా ఫీలయ్యేట్లు చేశాను. కర్కోటకుల్ని కరుణామయులుగా మార్చేశాను. తొమ్మిది మార్కుల వాళ్ళని తొంభై తొమ్మిది మార్కుల వాళ్ళగా తీర్చిదిద్దాను. ఆశ్లీలుల్ని సచ్ఛీలురుగా మార్చి సమాజానికి సేవ (డబ్బు తీసుకునే అనుకోండి) చేశాను. అట్టి నాకు, ఒక తెలుగు రచన ముందుకు కదలకపోవుటయా! ఇది కలయా? నిజమా? భ్రాంతియా? ఎవరక్కడ? దుశ్శాసనా! ఈ అవమానం నేను భరింపలేకున్నాను. చితి పేర్పించు, వెంటనే ప్రాయోపవేశం చేస్తాను. 'రారాజా! ఆగుము. నీవే యిటుల ఆలోచించినచో మేమైపోవాలి? నీ తమ్ములం నూర్గురం వున్నాం, ఆజ్ఞాపించు. తక్షణం చతురంగ బలాలతో వెళ్లి ఆ దరిద్రపుగొట్టు తెలుగు సాహిత్యాన్ని భస్మీపటలం చేసేస్తాం.' అని ఎవరూ ఎంతకీ అనరేమి? ఒరేయ్! ఎవడోకడు వచ్చి నా ప్రాణాల్ని కాపాడండ్రా! బాబోయ్!! ఆలీసం అయితే అన్యాయంగా చచ్చూరుకుంటాను. ఇంతలో మెలుకువొచ్చింది. ఔరా! ఇదంతా కలన్న మాట! పుస్తకం మహిమ! కొన్ని పుస్తకాలు నిద్ర మాత్రల్లా పంజేస్తాయి. వెంటనే పుస్తకం టపుక్కున మూసేసి పడు

కున్నాను. మర్నాడు ఇంకో రచయిత పుస్తకం, ఈసారి రెండో పేజి దాటలేకపోయ్యాను. అవమాన భారంతో, శోకంతో కృద్ధుడనై మళ్ళీ మాగన్ను నిద్రలోకి జారుకుంటిని. మళ్ళీ దుర్యోధనుడు ప్రత్యక్షం! 'ఇక నీకు మరణమే శరణ్యం.' అంటూ ఎస్వీరంగారావులా వికటాట్ట హాసం చేయుచుండగా మెలకువొచ్చింది. ఇంక నాకు పట్టుదలొచ్చేసింది. 'ఇవ్వాళ - నేనో తెలుగు సాహిత్యమో తేలిపోవాలి' అని పట్టుదలగా ఇంకో రచయిత పుస్తకం తెరిచాను.

ఈ పుస్తకం మొదటి పేజి దాటట్లేదు. హృదయం బరువెక్కింది, గుండె నీరయ్యింది, మనసు తల్లడిల్లింది. కంట్లో నీటిపొర! ఏమి నా దౌర్భాగ్యము? నా అఖండ పఠనాశక్తి ఏమయ్యింది? ఏమయ్యింది? ఎక్కడకి పోయింది? కహా గయా? అని మనసు ఘూర్ణించింది.. దీనంగా, దిక్కు తోచక, బిత్తర చూపులు చూసింది. ఫ్రిజ్ తెరిచి ఐస్ వాటర్ గటగటా తాగాను. కడుపు చల్లబడింది, తెలుగు సినిమాకి 'శుభం' కార్డు పడినప్పుడు కలిగే ప్రశాంతత వంటిది లభించింది. ఇప్పుడు బుర్ర ఆలోచించడం మొదలెట్టింది.

'నేనవర్ని? సగటు తెలుగు పాఠకుణ్ని. నేనెవర్ని? ప్రభుత్వ గ్రంధాలయంలో దుమ్ము కొట్టుకుపోయిన పాత పుస్తకం లాంటి వాడిని. నేనెవర్ని? పెద్దబాలశిక్షకీ, ఉరిశిక్షకీ తేడా తెలియని అజ్ఞానిని. నేనెవర్ని? 'ది హిందూ'ని హిందువులు మాత్రమే చదువుతారనుకున్న అమాయకుణ్ని. నేనెవర్ని? జీవన పరమార్ధాన్ని కాఫీ హోటళ్ళల్లో, సినిమా హాళ్ళల్లో వెతుక్కున్న వ్యర్ధజీవిని. నేనెవర్ని? నేనెవర్నీ కాను, నేను నేనే!'నువ్వో జ్ఞానివా? కాదు. నువ్వో సాహిత్య పాఠకుడివా? కానేకాదు. నేను చందమామ, విజయచిత్ర మాత్రమే చదువు కున్న అపాఠకుణ్ని. నువ్వో సాహిత్య విమర్శకుడవా? కాదు బాబూ కాదు, అసలు నాకా మాటకి అర్ధమే తెలీదు. మరి నీకెందు కీ ఆపసోపాలు? నీకు నచ్చింది తిను, నచ్చింది చూడు, నచ్చింది చదువుకో! ఈ భువనము నందు నీవొక నీటి బిందువువి, ఇసుక రేణువువి, అరిగిపోయిన కారు టైరువి, కాల్చి పడేసిన సిగరెట్టు పీకవి! కావున – ఆయాస పడుతూ అర్ధం కాని విషయాల జోలికి వెళ్ళడం మాని.. నీకు ఆనందం కలిగే పన్లు మాత్రమే చెయ్యి! దేశాన్ని ఉద్ధరించే ప్రయత్నం మానుకో!

అమ్మయ్య! మనసు ప్రశాంతంగా అయిపోయింది.

THIS PAGE IS SPONSORED BY VENKAIAH DAMA

**VENKAIAH DAMA MS PE. CLU. ChFC**

143-02 45 AVE. FLUSHING, NY 11355
PHONE: (718) 886 4077 FAX: (718) 886 7007
PHONE®: (718) 762 7173 E-mail: venkaiah.dama@nmfn.com

**(In Financial Services since 1976)**



**TAX SAVINGS and/or DEFERRALS**

JOINT COMPLIFE INSURANCES
529 COLLEGE SAVINGS PLAN
FIXED & VARIABLE ANNUITIES
IRAS: REGULAR, ROTH, SEP, SIMPLE & NON-QUALIFIED
KEOGH & CORPORATE PENSION PLANS
REQUIRED MINIMUM DISTRIBUTIONS
FOUR WAYS TO REDUCE CAPTIAL GAIN TAXES




**Asalatha "Asha" Vikuntam**

Realtor Associate



**Community Expert**

**2005 Member of Mercer County Board of Realtors**

**Cranbury Resident since 1999**

**Marketing Specialist**

Century 21

**Abrams, Hutchinson & Associates**

**10 Schalks Crossing Road**

**Plainsboro, NJ 08536**

**609-750-7300**

**Cell Phone 732-470-4717**

నేనిప్పుడేం చెయ్యాలి? కొద్దిసేపు ఆలోచించిన మీదట, రావిశాస్త్రి 'బాకీ కథలు' తీసుకున్నాను. పక్కింటి అబ్బాయి, వెన్నెల, పాతదే కథ.. వరసగా కథలు చదువుతూనే వున్నాను. నిద్రా గిద్రా ఎగిరిపోయింది. మా చాత్రిబాబు మాటల మాయలో పడిపోయ్యాను, రచనా ప్రవాహ వేగానికి కొట్టుకు పోసాగాను. 'అబ్బా! తల దిమ్ముగా ఉందేంటి?' అనుకుంటూ టైమ్ చూశాను. తెల్లావారు ఝూము నాలుగయ్యింది. అయినా ఏం పర్లేదు, నాకిప్పుడు తెలుగు కథలు చదవగలననే కాన్ఫిడెన్స్ వచ్చేసింది.

ఆ రోజున నేనో జీవిత సత్యం తెలుసుకున్నాను. పక్షులు మాత్రమే ఎగురుతాయి, పులి మాత్రమే వేటాడుతుంది, పోలీసులు మాత్రమే ఎన్‌కౌంటర్లు చేస్తారు, ప్రకృతి వైపరిత్యాల్లో పేదవాడు మాత్రమే చస్తాడు, కాఫీ మాత్రమే కమ్మగా వుంటుంది, విస్కీ మాత్రమే వెచ్చగా వుంటుంది, రావిశాస్త్రి మాత్రమే నాకు నచ్చిన కథ రాయగలడు. తాజ్‌మహల్ అందముగా యుండును, సావిత్రి నటన అద్భుతముగా యుండును, కొత్తావకాయ ఘాటుగా యుండును, మండువేసవిలో తొలకరిజల్లు ఆహ్లాదముగా యుండును, కృష్ణమ్మ ప్రవాహము వేగముగా యుండును? ఈ 'యుండును' లకి ఇంకో వంద 'యుండును'లు కలిపి. అవన్నీ ఎందులో యుం డును? రావిశాస్త్రి రచనల్లో యుండును! రావిశాస్త్రీ! థాంక్యూ వెరీ మచ్! యువార్ ద బెస్ట్! ఐ బో మై హెడ్ టు ఎ ట్రూలీ గ్రేట్ రైటర్.

**జిడ్డు కృష్ణమూర్తి**

శ్రీ మోహన్ వల్లభజోశ్యుల

భక్తితత్పరతన నిత్యపూజాధ్యానములతో
బతుకు గరపుచుండెడి తల్లి పెంపకములో
ధన్యుడైనాడు పరాతత్వధ్యాసలో పలుమార్లు
దివ్యదృష్టి సంపన్నతన వెలుగొందినయామెకు
నీడయై అద్యాత్మికానుభూతి గ్రోలినాడు,బాల్యమందే.
సత్యాన్వేషణాదీక్షకై మార్గము ప్రేరణ యగుటకేమో


Livingston Pediatrics
*You are our top priority!*

American Academy of Pediatrics

About Us . . . We handle the health care needs of infants, children and adolescents. Prenatal counseling is also available.

We will do our best to see that your child's health needs are served appropriately and quickly. Our practice has an experienced staff available to answer your questions.

Full modern office with electronic medical records.



**Dr. Ramalakshmi Yeramilli, MD**
Member of the AAP,
Board Certified in Pediatrics
Robert Wood Johnson University Hospital
St. Peters University Hospital, New Brunswick

www.livingstonpediatrics.com

**New Patients Welcome!**

**We handle the health care needs of infants, children and adolescents.**

**732-246-7171**
**345 Livingston Ave.**
**New Brunswick, NJ 08901**
**Fax: 732-246-8974**
**Habla español, Hindi, Telugu**

**Office hours:**
**Monday - Saturday**
**Evening appts. available**
**By appointment only**

**Accepting Most Insurances**

Telugu Fine Arts Society 30th Annual Celebrations July 2015

Invitation to writers for publications in the souvenir

తెలుగు జ్యోతి

March 18th, 2015

To TFAS members and Guests:

You may know by now that Telugu Fine Arts Society (TFAS) is celebrating 30th year anniversary celebrations on July 11th, 2015. We are pleased to inform you that a souvenir will be released on this occasion. TFAS has been publishing Telugu Jyothi, a literary magazine since January 1984. The Telugu Jyothi Editorial Committee is leading the effort to publish the souvenir.

We invite Telugu short stories, essays, and poems from writers to be published in the souvenir. This is a general invitation and not a competition. The writings should reflect Telugu culture, society and life. We encourage articles reflecting the lives of Telugu people in US and Canada.

We also want to devote some pages to focus on the role of TFAS as an organization in the Telugu/Indian community. We invite articles that identify the contributions of TFAS to cultural, literary, and community activities and what role TFAS can/should take in the future.

Some articles may describe the writer's personal experience interacting with TFAS in organizing programs or exhibits, organizing and attending the functions in the first 10 years of TFAS, or how their children helped or participated.

We want our next generation to contribute articles on this topic (the articles can be in English). The children who grew with TFAS in the 1980's are busy today with careers and families. And they are trying to get 'their' children into TFAS activities now! They should have many valuable suggestions as to the future direction of TFAS. We are hoping that this section of the souvenir would be thought provoking and a reference to other similar organizations. If you are submitting an article please follow the guidelines below:

- Each story or essay should be no more than 3 to 4 typed pages and poem no more than one typed page. Articles should be original and unpublished elsewhere.
- Must be received by April 30th, 2015. Email a word document to tjsouvenir@gmail.com
- Articles must be typed in Unicode font (such as Gautami 11 point). You can use http://lekhini.org/ or any other editor like http://www.quillpad.in/editor.html (select Telugu as language) to type the documents in Telugu.
- If your article is not published in the souvenir, we will consider publishing in a future Telugu Jyothi issue (both print and online versions).
- All decisions are final.

Thank you in advance.
Sincerely,

TFAS Souvenir Committee

## తెలుగు కళా సమితి 30 వ వార్షికోత్సవ సంబరాలు - జూలై 2015

### జ్ఞాపికలో రచనలకోసం రచయిత(త్రు)లకు ఆహ్వానం

మార్చి 18, 2015

తెలుగు కళాసమితి సభ్యులు మరియు సాహితీమిత్రులకు:

మీ అందరికీ నమస్కారం. తెలుగు కళాసమితి 30వ వార్షికోత్సవం జూలై 11, 2015 న నిర్వహించడానికి ట్రస్టీలు నిర్ణయించిన విషయం మీకు తెలిసే వుంటుంది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక సంచిక ప్రచురించాలని తెలుగు కళాసమితి నిర్ణయించింది. జనవరి 1984 నుంచీ తెలుగు కళాసమితి "తెలుగు జ్యోతి" పత్రికని ప్రచురిస్తోంది. తెలుగు కళాసమితి 30వ వార్షికోత్సవం ప్రత్యేక సంచిక కూడా తెలుగు జ్యోతి సంపాదక బృందం సారధ్యంలో ప్రచురించబడుతుంది.

ఈ సందర్భంగా రచయిత(త్రు)లనుంచి ముఖ్యంగా అమెరికాలో ఉంటున్న రచయిత(త్రు)లనుంచి ఈ సంచికలో ప్రచురణ నిమిత్తం రచనలను ఆహ్వానిస్తున్నాం. ఈ రచనలు **సాధారణ ప్రచురణ నిమిత్తం – రచనల పోటీకి కాదు** అని గమనించగోర్తాము. రచనలు తెలుగువారి జీవితాలు, తెలుగుసంస్కృతి నేపధ్యంలో వుండాలి. ప్రవాసాంధ్రుల జీవన విలువలని ప్రతిఫలించే రచనలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. వీటితో బాటు మన ప్రవాస జీవితాల్లో తెలుగు కళాసమితి ప్రాధాన్యం, తోడ్పాటు అలాగే మన భాష, సంస్కృతి మరియు సమాజసేవల్లో ప్రస్తుత మరియూ భవిష్యత్తులో తెలుగు కళాసమితి పాత్ర గురించిన వ్యాసాల్ని కూడా అభిలషిస్తున్నాం. తెలుగు కళాసమితి కార్యక్రమాల్లో మీ తోడ్పాటు, సమితి తొలినాళ్ళలొ సమితి కార్యక్రమాల్లో మీ స్వానుభవాలు, మీ పిల్లల అనుభవాలు కూడా మీ రచనలకి ప్రేరణలు కావచ్చు.

ఈ సంచికలో మన యువతరం రచనలకు కూడా ప్రాధాన్యం ఇస్తాం. వారి రచనలు తెలుగులోనే ఉండనవసరం లేదు. ఇంగ్లీషులో కూడా వ్రాయచ్చు. ఎనభయ్యవ దశకంలో సమితితో పాటు ఎదిగిన తరం ఇప్పుడు సమాజంలో బాద్యతగల స్థానాల్లో వుంది. వాళ్ళ వారసుల్ని కూడా తెలుగు కళాసమితి కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారు. వాళ్ళ అనుభవాలని, ఆలోచనలని, అభిప్రాయాల్ని రచనల రూపేణా మాతో పంచుకోవలసినదిగా ఆహ్వానిస్తున్నాం. ఈ రచనలు మన సమాజంలో ఉన్న ఇతర సంస్థలకు కూడా ఉపయోగకరంగా ఉంటాయని ఆశిస్తున్నాం. తమ రచనలని పంపించేవారు ఈ కింది సూచనలని గమనించగోరుతున్నాం.

- మీ రచనలు మీ స్వంతమయి ఇతఃపూర్వం ఎక్కడా ప్రచురించబడకుండా వుండాలి. కధలు, వ్యాసాలూ అచ్చులో మూడు లేక నాలుగు పేజీలు, కవితలు ఒక పేజీ మించకుండా వుండాలి.
- మీ రచనలు వర్డ్ డాక్యుమెంట్ రూపంలో ఏప్రిల్ 30th, 2015. లోగా tjsouvenir@gmail.com కు చేరాలి.
- రచనలు తెలుగు యూనికోడ్ ఫాంట్ ( ఉదా, గౌతమి 11 పాయింట్) లొ వుండాలి. మీరు ఇందు నిమిత్తం http://lekhini.org/ లేదా http://www.quillpad.in/editor.html (తెలుగు భాష ఎంచుకోండి) వాడి టైపు చెయ్యచ్చు.
- ప్రత్యేక సంచికలో ప్రచురించబడని రచనలు తెలుగు జ్యోతిలో ( అచ్చుపుస్తకం మరియు ఆన్-లైన్ వెర్షన్లలో) ప్రచురించ బడతాయి.
- ఈ విషయంలో తుది నిర్ణయం తెలుగు కళా సమితి సావనీర్ కమిటీ వారిదే.

కృతజ్ఞతాభివందనాలతో

**తెలుగు కళా సమితి సావనీర్ కమిటీ**

# BALACHANDAR JAYARAMAN CPA LLC

**CERTIFIED PUBLIC ACCOUNTANT**
**BUSINESS CONSULTANT**
**719 Inman Avenue, Suite # 201, P.O. Box 117**
**Colonia, NJ 07067**
**www.jayaramancpa.com**

**Email: Bala@JayaramanCPA.com**
**732-943-7605 (Tel)**
**732-539-0924 (Cell)**
**732-909-7122 (eFax)**

**Member: AICPA**
**Member: NJSCPA**
**Licensed as CPA in NJ & IL**



**Free Initial Consultation** **Low Cost / High Quality Service**

## Prompt & Individual Attention by a CPA

**On-Time Performance** **High Customer Satisfaction**

- *Tax Planning, Preparation and Representation*
- *Accounting and Auditing Services*
- *New Business Consultation*
- *Financial Statements: Compilations, Reviews & Audits*
- *Sales Tax and Payroll Tax Returns*
- *Financial and Compliance Services for Government Programs*

*For Corporations, Partnerships, Individuals, LLC/ LLP & Non-Profits*

*CALL BALA JAYARAMAN CPA @ 732-943-7605*

పరమపదించెను తల్లి నాతని కౌమార్యమందే.
పిల్లలందరు కలిసి పదునొకండుగురైన,
అష్టముడు క్రిష్ణమూర్తి, తమ్ముడు నిత్యానందులు
నుండిరి తండ్రి పెంపకమందు కడుకూర్మితోను
విడిచియుండ నోపరొక్కదినమైన యెందుకైన.
ప్రపంచ దివ్యజీవన సమాజోద్ధరణకు నాధిపత్యము వహింప
మైత్రేయువంటి లోకోత్తర దివ్యపురుషుల ప్రేరణలనాదరవుగ
ప్రముఖులు లెడ్బీటర్, అనిబిసెంట్యాదులు నెంపికజేసిరి
పెద్దవానిని పదివత్సరముల వయసుండగ.
తండ్రి నీడయు, స్వేచ్ఛాజీవనమును, తెలుగునాడును,
కోర్టుతీర్పు మేరకు వీడి, పదునొకొండేళ్ళ ప్రాయములో
అనిబిసెంటుతో అంగ్లదేశమునకు చనియె
తనకధకాలంబనమేదియో నెరుగలేని స్థితిలో
నియమితులై నేర్చిరి చదువులు ,సంస్కారము,
సంస్కృతులు గూడ పాశ్చాత్యులు బోధించి నటుల
నియమమన్నది యెందుకో దెలియకున్న వినయముగ
నాగరికతను, సర్వమత సిద్ధాతముల గూడ నేర్చిరి
పెద్దవాని, క్రిష్ణ, దృష్ఠి నిజమన్ననేమొ దెలియగోరి
ధ్యానము విడువక చేయుచుండె ప్రతిదినమ్ము.
పంచభూతముల ఆశీర్వాదమో ,అదృశ్య వ్యక్తుల ఆశీస్సులో
పొందెను జ్ఞానానుభూతి కాలక్రమమున
అనుజుని అకాలమరణమొక పెనుతుఫానై
తుడిచివేసెను మోహమున్నిర్విశేషముగ
తోచెను మనుజుల బంధకారణము
కాంచెను నాలోచనల జన్మరహస్యమును
తెలిసెను వాని పూర్వ క్షేత్ర వైభవమును
తపించెను ఆ అనుభవమితరులతో బంచుకొనగ
దివ్యజీవన సమాజపు లోకాధిపత్యమివ్వ
సర్వాధికారిపై సంస్థనే రద్దుజేస్తివంతలోనె
మైత్రేయు వరమని యెంచి సహచర్యుల వొప్పించి
చదువుసభ్యతల నేర్పించి పోషించి పెంచి
సాటిలేని నాయకునిగ నియమించిన
అనిబిసెంటు నామె సహచరుల యాశలు
యా సమాజపు నునికి నొక్క వేటున వమ్ము జేసి
అనంత కీర్తి ప్రతిష్ఠల నిచ్చు నవకాశము వద్దని
ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అధ్యక్ష పదవి తిరస్కరించె
అండదండలు, ఐశ్వర్య కీర్తులు కాంక్షించువారు
అజ్ఞాతలై, అవిధేయులై యుండలేరని
జ్ఞానమార్గమున స్వేఛ్ఛగ జరించలేరని
అనియొనేమొ, పేదవై వేదికను విడిచినావు
నీది కాగల సౌభాగ్యమును వద్దనినావు
అత్తరి నీ మానసిక స్థితి యెట్టుండెనో
నీజ్ఞానానుభవము యేమై యుండునో?
ఆ ధైర్యం తెగింపు సత్యవర్తన నిస్వార్ధం
నిరహంకార ప్రవుత్తి ధనకీర్తిపదవులన్న నిరాకర్షణ
ఆ బాహ్యంతరశుచిధ్యాస వైభవలక్ష్మియన్న విరాగమూ
అన్నీ కలగలిసి రూపొందిన ఆ మనోగతిని యూహింపలేను
ఆ స్థితికిజేర్చిన అనుభవములేవొ దెలియలేను
ఈశ్వరానుగ్రహముచే నూహింపగలను.
బహిర్ప్రమాణములు అనుకరణోచితము,
ఆచరణీయములైనను
సర్వప్రమాణములనధిగమించి
అలోచనలకందని సద్భావమును
స్వప్రమాణానుగతముగ
నెరుగవలెనని వక్కాణించినావు
జ్ఞాన స్వరూపానుభూతి
మార్గనిర్ణీతము గాని క్షేత్రమని
దారులన్నవి యాలోచనలవల్లనే రూపముల నొందునని
ఆలోచనాస్రవంతులు లేశమాత్రము లేని మానసమే సుక్షేత్రమని
నట్టి సుక్షేత్రములో నెరుకతో మునిగియున్న మౌనియగునని
నత్తరి సర్వాంతర్యామియౌ జ్ఞానక్షేత్రము చేరువవునని
నిర్మొహమాటముగ నిక్కచ్చిగా జెప్పిన వ్యక్తి
ప్రమాణరహిత సాధన
సామాన్యులకాచరణీయము కాకపోయినా
ఉదాహరణలు యుపమానములులేని



For the if in life®
Employee Benefit Plans
Executive Benefit Plans
Pension & Profit Sharing Plans
401(k), 403(b), SEP, 412(i) Plans
Health Insurance
Business Buy Sell Insurance
Commercial Insurance
Life Insurance
Long-Term Care Insurance
Disability Income Insurance
IRA, Roth IRA & Annuities
Retirement Planning
Estate Conservation Strategies
Auto and Home Insurance
MetLife®
One Blue Hill Plaza, 2nd Floor
P.O Box 1666, Pearl River, NY 10965
www.joseph.metlife.com
Tel. : 845-620-3115
Cell. : 845-323-3666
Get a Quote FREE
George Joseph
Financial Services Representative
Investment Adviser Representative
e-mail: gjoseph@metlife.com
CA Lic.# OE85378
Metropolitan Life Insurance Company(MLIC), New York, NY 10036.
Some health insurance products offered by unaffiliated insurers through the Enterprise General Insurance Agency Inc.(EGA), 300 Davidson Avenue Somerset, NJ 08873-4175.
Securities and investment advisory services offered by MetLife Securities, Inc. (MSI) (member FINRA/SIPC), and a registered investment advisor. Auto and Home Insurance offered by Metropolitan Property and Casualty Ins. Co. (Met P&C®) and affiliates, Warwick, RI. MLIC, the EGA, MSI and Met P&C® are MetLife companies.
L1210150024[exp0112][AZ,CA,CT,FL,GA,MA,MD,NC,NJ,NY,OK,PA,TX,VA]

సంభాషణల సత్సంగ సభలు
సాధారణ ధారణాసంపన్నులనాకర్షింపకున్నా
ప్రపంచమున పలు మత, శాస్త్రీయ విజ్ఞాన రంగములలో
ప్రఖ్యాతిగాంచిన మేధాసంపన్నుల

ప్రమాణములకతీతుడై ప్రభవించి
జ్ఞానయోగియై స్వప్రకాశమాన్యుడై విరాజిల్లె
ధన్యజీవి శ్రీ జిడ్డు కృష్ణ మూర్తి !!

## శిరోముండనం

సాయి బ్రహ్మానందం గొర్తి, కాలిఫోర్నియా

అమ్మకి సీరియస్‌గా ఉందని ఫోన్ రావడంతో హుటా హుటిన ఇండియాకి బయల్దేరాను. అమ్మ నన్ను కలవరిస్తోందని మా చెల్లెలు కాచి చెప్పింది. మూణ్ణెల్ల క్రితమే కుటుంబసమేతంగా అనాతవరం వెళ్ళి రావడంతో ఒక్కణ్ణే బయల్దేరాను.

"ఏజ్ కదా! డాక్టర్లు వారం కంటే బ్రతకడం కష్టం అంటున్నారు. నువ్వు వస్తే పొలాల పేపర్లమీద సంతకాలు పెట్టే పని కూడా వుంది," అని అన్నయ్య చెప్పాడు.

క్రితం సారి వెళ్ళినప్పుడు పొలాల లావాదేవీల మధ్య మా ఇంట్లో పెద్ద గొడవే జరిగింది. మా అమ్మ పేరునున్న పొలం మా చెల్లెలు కాచి పేరున రాయిద్దామని అమ్మ కోరిక. అన్నయ్యకి మాత్రం సుతరామూ ఇష్టం లేదు. డబ్బు అవసరం నాకు అంతగా లేదు కాబట్టి అమ్మ ఇష్టం అని చెప్పాను. కాచి పేరునున్న ఆ అయిదెకరాలూ తనకే చెందాలన్నది అన్నయ్య వాదన.

నిజానికి అది అమ్మ పుట్టింటి ఆస్తి. మా అమ్మమ్మ పేర ఆ పొలాలున్నాయి. ఆవిడ పోతూ పోతూ ఎవరికీ తెలియకుండా అమ్మ పేర రాయించింది. అప్పట్లో మా నాన్నకది కంటగింపుగా ఉండేది. బ్రతికున్నన్నాళ్ళూ ఆ పొలం అమ్మేయాలని నాన్న చాలా ప్రయత్నాలు చేశాడు. అమ్మ మొండిగా ఇవ్వలేదు. హఠాత్తుగా నాన్న పోవడంతో ఆ పొలాల గురించి గొడవలు పోయాయి. ఏటా వచ్చే శిస్తుతో రోజులు సాఫీగానే పోతున్నాయి.
అన్నయ్య పేరున అనాతవరంలో పెద్దిల్లు, నాన్న సంపాదించిన ఏడెకరాల కొబ్బరితోట రాస్తానంది. నాకయితే చిల్లి గవ్వ కూడా అవసరం లేదన్నాను. అమ్మమ్మ పేరింటిదని ఆ పొలం కాచికే చెందాలని అమ్మకి బలంగా వుంది. మా అమ్మమ్మ పేరు కామేశ్వరి. అదే పేరు మా చెల్లెలికి పెట్టారు. ఇంట్లో అందరమూ కాచి అనే పిలుస్తాం. అమ్మమ్మ పోయి పాతికేళ్ళు దాటినా మా ఇంట్లో ఆవిడ పేరు నిత్యమూ ఏదో రకంగా మాటల్లో వస్తూనే ఉంటుంది. మా అమ్మమ్మకి అతి శుభ్రం. దానికితోడు చచ్చేటంత చాదస్తం. ఈ రెంటితో ఆవిడ అందర్నీ చంపుకుతినేది.

మా చెల్లెలు కాచికయితే అమ్మమ్మ పేరంటనే చికాకు. అది ఏం చేసినా, మాట్లాడినా – 'పేరు పెట్టినందుకు అమ్మమ్మ పోలికలు బానే వచ్చాయని,' అందరూ వేళాకోళం చెయ్యడంతో మరింత ఉడుక్కునేది. మా అమ్మమ్మకి కొడుకులు లేరు. ఇద్దరు కూతుళ్ళలో మా అమ్మ చిన్నది. అమ్మ పెళ్ళవగానే మా తాత

**AAA CHECKER**



**Airport taxi & Limo Service**

**☎ CALL (732) 486-5161; (732) 689-0161**

**WWW.AAACHECKER.COM**
**aaachecker@gmail.com**

**Pickup / drop-off to EWR, JFK and LaGuardia**

**(Telugu speaking drivers available - 10 % discount for TFAS members)**

పోవడంతో మా పంచన చేరింది. పెద్ద కూతురు ఢిల్లీలో ఉండేది. ఆవిడ అంతగా పట్టించుకోలేదు. మా అమ్మమ్మ పేరున్న పొలం మా అమ్మ పేరున రాయడంతో వాళ్ళకి కోపాలొచ్చి రాకపోకలు పూర్తిగా పోయాయి. విమానం బొంబాయిలో దిగింది.

కస్టమ్స్ నుండి బయటకొస్తూండగా — "ఏయ్! రామం!" అంటూ ఎవరో పిలవడంతో వెనక్కి తిరిగి చూశాను. ఒకావిడ నాదగ్గరకొచ్చి, "నువ్వు కామేశ్వరిగారి మనవడు రామానివి కదూ? మీది అనాతవరం..." అంటూ ఆవిడ నా మొహంలోకి చూస్తూ అంటే చప్పున ఆవిణ్ణి గుర్తుపట్టాను. "మీరు చంద్రమతి కదూ?" ఆవిడ నవ్వుతూ – "ఎన్నాళ్ళయ్యిందో మిమ్మల్ని చూసి. నువ్వు రామానివా, కాదా అన్న అనుమానం వచ్చింది. సరేలే కనుక్కుంటే పోలా అని కేకేశాను. నా ఊహ కరక్టే అయ్యింది. నువ్వు చిన్నప్పుడెలా వున్నావో అచ్చం అలాగే ఉన్నావు. ఏ మాత్రం మార్పు లేదు..." అంటూ నన్నొక్క మాటా మాట్లడనివ్వకుండా చెప్పుకుపోతోంది.

చంద్రమతిని చూసి పాతికేళ్ళు పైనే అయ్యింది. నాకంటే పదేళ్ళు పెద్ద. అప్పట్లో వాళ్ళు అనాతవరంలో మా ఇంట్లో అద్దెకుండేవారు. చంద్రమతి నాన్న అమలాపురం కోర్టులో ప్లీడరు గుమాస్తాగా పని చేసేవాడు. అప్పట్లో మా వూరు చుట్టుపక్కల చంద్రమతి గురించి తెలియని వాళ్ళు లేరు. ఎందుకంటే అమలాపురంలో ఉండే ఒక మెడికల్ రిప్రజెంటేటివుతో లేచిపోయింది. చిన్న చిన్న పల్లెటూళ్ళల్లో ఇలాంటి సంఘటనలు అరుదుగా జరిగేవి. ఎంతో నెమ్మదిగా నోరు మెదపలేని చంద్రమతి అలా చేసిందన్నది అందరికీ ఆశ్చర్యమే! కొంతమంది ఆత్మహత్య చేసుకు చచ్చిపోయిందనీ, అది పైకి చెప్పడం ఇష్టంలేక లేచిపోయిందనే పుకారు లేవదీశారని అనుకునే వారు. చంద్రమతి ఇన్నాళ్ళూ ఏమయ్యిందని అడుగుదామనుకొని ఆగిపోయాను. చంద్రమతి మా కుటుంబం గురించి పేరుపేరునా అడిగింది. చెప్పాను. అమ్మకి బావోలేదన్న విషయం కూడా చెప్పాను.

"ఇప్పుడెక్కడుంటున్నావు? ఎంతమంది పిల్లలు?" అని అడిగింది.

"నేనా, బెహ్రైన్ ఆయిల్ కంపెనీలో ప్రోజెక్ట్ మేనేజర్ని. ఇద్దరబ్బాయిలు. గత పదేళ్ళుగా అక్కడే ఉంటున్నాం. ఏటా వచ్చి పోతూంటాం," అని చెప్పి, తన గురించీ అడిగాను. చంద్రమతి ప్రస్తుతం బొంబాయిలో ఉంటున్నానని చెప్పి, అడ్రసిచ్చింది.

"చంద్రా, నువ్వు ఈ మధ్యలో అనాతవరం వెళ్ళేవా?" ఉండబట్టలేక అడిగాను. లేదన్నట్లు తలూపింది. అమ్మా నాన్నా పోయి చాలా కాలమయ్యిందని మాత్రం చెప్పింది. నేను వివరాల కోసం రెట్టించలేదు.

"అవును. మీ చెల్లెలు కాచి ఎక్కడుంది? చిన్నప్పుడు


## Simhadri M Gupta MD

### Board Certified in Neurology since 1998

**Trained at Mt Sinai Hospital, NY city**
**Subspecialty Neuromuscular disease**

Office Locations

2 Lincoln Highway, Suite 302
Edison, NJ 08820

81 Veronica Avenue, suite 201
Somerset, NJ

Telephone: 732-548-1770; 732-548-1778 Fax 732 548-1772

Languages: English, Telugu, Gujarati, Hindi, Kannada and other translations




# Bayshore Ophthalmology, LLC



**SUREKHA COLLUR, MD FRCS**
*Board certified Ophthalmologist*
**Fellowship trained in Glaucoma**
NJ Top Docs
New Jersey's Total Healthcare Resource



**MEGGAN C. HEINZ , OD**
*Doctor of Optometry*
**Lic#27OA00597902**
**OM#27OM00040802**

**CATARACT ▪ GLAUCOMA ▪ EYELIDS ▪ PRK ▪ MULTIFOCAL LENS IMPLANTS**
**Femtosecond Laser Assisted Cataract Surgery**

**Visit Our Onsite Optical Shop**
**Evening Hours and Saturdays**
*YOU CAN MAKE APPINTMENTS VIA OUR WEBSITE*
www.bayshoreophthalmology.com

| We Offer CareCredit Low Monthly Payment Plans | *719 North Beers Street • Holmdel* **732 264 6464** | Like us on Facebook |
|---|---|---|

భలే ముద్దుగా ఉండేది!"

"పెళ్ళయిన అయిదేళ్ళకే భర్త పోవడంతో అనాతవరంలోనే ప్రస్తుతం అమ్మ దగ్గర ఉంటోంది, చిన్న బిడ్డతో," అని కాచి గురించి చెప్పాను.

"అయ్యో! అంత చిన్న వయసులో భర్త పోవడం అన్యాయం. మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు కదా?"

"మా అమ్మకీ దాని గురించే బెంగ. పెళ్ళి చేసుకోమని అందరమూ పదే పదే పోరుతున్నాం. నాకు తెలుసున్న ఒకాయన చేసుకోవడానికి రెడీ. మా చెల్లెలొక మూర్ఖురాలు. మాట వినదు. పేరు పెట్టినందుకు అంతా మా అమ్మమ్మ పోలికలే!"

"తప్పు రామం. పోయినవాళ్ళని నిందించడం మంచిది కాదు. నువ్వే మీ చెల్లికి నచ్చ చెప్పి చూడు," అన్నది చంద్రమతి. మేము గత పదేళ్ళుగా కాచిని రెండో పెళ్ళి విషయమై ఎంత పోరుతున్నామో చెప్పాను.

నా హైదరాబాదు ఫ్లయిటుకి ఇంకా రెండు గంటలుంది. ఇద్దరం పాత జ్ఞాపకాలు బాగానే నెమరువేసుకున్నాం. చంద్రమతికి ఇద్దరు పిల్లలనీ, భర్త ఒక చిన్న ఫార్మాసూటికల్ కంపెనీ నడుపుతున్నాడనీ చెప్పింది. నేను చంద్రమతి గతం గురించి తెలుసుకోవాలన్న ఉత్సాహం ఉన్నా, ప్రశ్నించలేదు. నా ఫోన్ నంబరూ, అడ్రసూ తీసుకుంది. తిరిగెళ్ళేటప్పుడు వాళ్ళింటికి రమ్మనమని పిలిచింది. తప్పకుండా వస్తానని చెప్పాను. చంద్రమతి మద్రాసు ఫ్లయిటుకి టయిమవ్వడంతో బయల్దేరడానికి లేచింది.

"వస్తా రామం. నిన్ను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. మీ వాళ్లని అడిగానని చెప్పు," అంటూండగా ఆమె కళ్ళల్లో సన్నటి నీటిపొర స్పష్టంగా కనిపించింది. వెళుతూ వెళుతూ వెనక్కి తిరిగి వచ్చింది. "రామం! నిన్నొకటి అడగచ్చా?" తటపటాయిస్తూ అంది. "ఏవిటి? చెప్పు చంద్రమతీ!"

"నాకు మీ అమ్మమ్మగారి ఫోటో ఉంటే ఇవ్వగలవా? ప్రతీరోజూ సంగీత సాధన చేసేటప్పుడు ఆవిణ్ణే తలచుకుంటాను," అంటూంటే ఆమె కళ్ళనుండి నీళ్ళు జలజలా రాలాయి. "తప్పకుండా!" అని చెప్పి శలవు తీసుకున్నాను. చంద్రమతి మా అమ్మమ్మ దగ్గర సంగీతం నేర్చుకోవడానికి వచ్చేది. మా అమ్మమ్మకి సంగీతం బాగా వచ్చు. చాలా బాగా పాడేది. కాచికి అంతా అమ్మమ్మ పోలికలే, రూపం, తీరూ, మాటతో సహా. ఈ ఒక్క సంగీతం తప్ప.

***

చంద్రమతిని కలిశాక హైదరాబాదు ఫ్లయిటులో అనాలోచితంగా నా ఆలోచనలన్నీ మా అమ్మమ్మ చుట్టూనే తిరిగాయి. నేను తొమ్మిదో తరగతిలో ఉండగా అమ్మమ్మ పోయింది. మా


NJ State Inspection Facility

ULTRA SERVICE CENTER

ROUTE 1 SUNOCO
PROFESSIONAL AUTOMOTIVE SERVICE

Complete Auto Repair....
European & Asian

Brakes
Exhaust
Electrical
Tune-Ups
Front End
Transmission
Engine Overall
Trans Tune-Ups
Diagnostic Work
Air Conditioning Service

Ram Dronavalli
ram@route1sunoco.com

386 US Highway 1
Edison, New Jersey 08817
Tel: (732) 985-3665
Cell: (732) 670-7453

www.route1sunoco.com



అమ్మమ్మకీ, నాకు అంతగా పడేది కాదు. మా ఇంట్లో ఒక చెక్క బీరువా ఉండేది. అందులో పైన రెండు అరలూ అమ్మమ్మవి. క్రింద రెండరల్లో నా బట్టలుండేవి. ఆవిడ అరలో తెల్ల బట్టలూ, కాసిని సామాన్లూ ఉండేవి. నేనేదో ఆవిడ వస్తువులు కెలికేస్తానని ఆవిడకి చచ్చేటంత అనుమానం. చిన్న గుడ్డసంచీలో డబ్బు దాచుకునేది. అది ఎప్పుడూ నడుం దగ్గర దోపుకునేది. ఆవిడకి అతి శుభ్రం. నేనొక ఎడ్డి మనిషిలా ఉండేవాణ్ణి. ఇద్దరం చచ్చేట్టు కొట్టుకునేవాళ్ళం. ఆవిణ్ణి తిట్టాల్సి వస్తే కాచి పేరు వంకపెట్టి చెల్లెల్ని తిట్టేవాణ్ణి. ఎన్ని విసుక్కున్నా ఎంతైనా మనవణ్ణి కదా, ఆవిడే సద్దుకునేది. మిగతా విషయాల్లో ఎలా వున్నా రెణ్ణెల్లకోసారి మంగలాడ్ని పిలిచే సమయానికి మాత్రం బాగానే కాకా పట్టేది.

అమ్మమ్మకి మొగుడు పోయాక శిరోముండనం చేయించారు. అందువల్ల నెత్తి మీద ముసుగేసుకొనేది. చూడ్డానికి పచ్చగా దబ్బపండులా ఉన్న అమ్మమ్మ మొహమ్మీద తెల్ల ముసుగు మాత్రం ఆవిడ జీవితంలో నల్లమచ్చే! మొగుడు పోయాక ఆడపడుచూ, అత్తగారూ దగ్గరుండి శిరోముండనం చేయించారని వాళ్ళని రోజూ తెగ తిట్టుకునేది. మగపిల్లలు లేక పోవడం వల్ల కూతురు పంచన చేరానన్న అసంతృప్తి ఆవిడ మాటల్లో కనిపించేది. దానికి తోడు మా నాన్నకి అమ్మమ్మంటే గిట్టేది కాదు. మొగుడు పోయాక ఆవిడ ఆస్తిని తన పేర రాయమని నాన్న అడిగితే రాయను పొమ్మంది. నాన్న గయ్యిమ ని లేచాడు. అమ్మ మాట కాదనలేక ఆవిణ్ణి చూడక తప్పలేదు. నాన్న మాత్రం ఆవిణ్ణి చాలా విసుక్కునేవాడు. లోపల ఏం బాధపడిందో తెలీదు, ఎప్పుడూ నాన్నని ఒక్క మాటనేది కాదు.

మా బాబయ్యకి పిల్లలు లేకపోతే నన్ను దత్తత తీసుకుం దామని మాటలొచ్చాయి. మా నాన్న సరేనన్నాడు. అమ్మకిష్టం లేదు. ఆ విషయమై అమ్మని ఒప్పించడానికి మా ఇంటికొచ్చి నప్పుడు మా బాబయ్యని దులిప్పడేసింది మా అమ్మమ్మ.

“నిజంగా పిల్లలంటే మమకారం ఉంటే బీదవాళ్ళ పిల్లల్ని పెంచుకో! అయినా రామం గాడే కావాలా? కాచిని ఎందుకు దత్తు తీసుకోవు? ఏం? ఆడపిల్ల పనికిరాదా?” అంటూ బాబయ్యని చీల్చి చండాడేసరికి బాబయ్య మరలా మా గుమ్మం తొక్కితే ఒట్టు.

***

చిన్నప్పటి సంఘటన నాకింకా గుర్తు. ప్రతీసారి మంగ లాడ్ని పిలిచినప్పుడు మాత్రం అమ్మమ్మ ఆ రోజంతా ఏడుస్తూనే ఉండేది. మంగలాడు పెరటి సందు వైపు వచ్చేవాడు. దూరం నుండి గుండు గీయించడం చూస్తూండేవాణ్ణి. చేస్తున్నంత సేపూ ఆవిడ కళ్ళల్లో నీళ్ళు జల జలా రాలేవి.




ఓ సారి ఎందుకేడుస్తోందోనని తెలుసుకోవాలని అడిగాను. “ఎందుకమ్మమ్మా ఏడుస్తావు? మంగలాడు గుండు గీస్తే నొప్పి పెడుతోందా?” “లేదురా! నొప్పి గుండుక్కాదు!” అంటూ ఏడుస్తూ గుండె మీద చెయ్యేసుకుని జవాబిచ్చింది.

“జుట్టు పోయిందనా? మళ్ళీ వచ్చేస్తుంది కదా?” ఆవిడ జవాబు అర్థంకాక అమాయకంగా అడిగేవాణ్ణి. ఎంత తిట్టుకున్నా అమ్మమ్మ ఏడవడం మాత్రం నేను తట్టుకోలేకపోయేవాణ్ణి. చిన్నతనంలో బాధ అంటే తెలిసేది కాదు.

నాకప్పుడు ఆవిడేం చెబుతోందో అర్థం కాలేదు. ఇప్పుడవన్నీ తలచుకుంటే బాధ కలుగుతుంది. అమ్మమ్మ శిరోముండనం సంఘటన తలుచుకున్నప్పుడల్లా బాధేస్తుంది. దారీ, గతీ లేక మా పంచన చేరిన ఆవిడ ఎంత నరకం అనుభవించుంటుందో కదా అనిపిస్తుంది. ఒక పక్క నాన్న చికాకు, మరో పక్క అన్నయ్యా నేనూ విసుగులు, తిట్లూ. వీటికి తోడు పక్కింటి వాళ్ళ వెటకారాలు, పనిమనుషుల ఈసడింపులూ. పైకి మాత్రం ఏమీ అనేది కాదు. ఏ త్యాగరాజ కృతో, రామదాసు భజనో పాడుకుంటూ కూర్చునేది. ఒక్కోసారి అది కూడా చేసుకోనిచ్చే వాళ్ళం కాదు.

“అబ్బా! ఆపవే ఆ కాకి సంగీతం. కావాలంటే పెరట్లో బాదం చెట్టుక్రింద కూర్చుని పాడుకో!” అని అందరూ విసుక్కునేవాళ్ళు. అలాగే చేసేదావిడ.

చంద్రమతికి అమ్మమ్మ సంగీతం నేర్పేది. చంద్రమతికి పదహారో ఏటే పెళ్ళి చేసి అత్తారింటికి పంపారు. ఒకమ్మాయి పుట్టింది కానీ అనారోగ్యంతో ఏడాదికే పోయింది. పెళ్ళయిన అయిదేళ్ళకే మొగుడు పోతే అత్తగారి వాళ్ళ బాధలు పడలేక పుట్టింటికొచ్చేసింది. కుట్లూ, అల్లికలూ వచ్చు. ఊళ్ళో వాళ్ళకి బట్టలు కుట్టేది. వాళ్ళ పిన్ని వాళ్ళింటికి తరచు అమలాపురం వెళ్ళొచ్చేది. వెళ్ళినప్పుడల్లా అమ్మమ్మకి పటిక బెల్లం, ఆల్బకరా పళ్ళూ పట్టుకొచ్చేది. అమ్మమ్మ పోయే రోజు నాకింకా గుర్తుంది. బీపీ పెరగడంతో ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ లాభంలేదంటే ఇంటికి తీసుకొచ్చేశారు. ఇహ చివరి దశలో పెరట్లో బాదంచెట్టు క్రింద ఒక చిన్న పందిరి వేసి పడుకోపెట్టారు. శీతాకాలం చలి తట్టుకోలేక మేం లోపలకి వచ్చేసేవాళ్ళం. అమ్మ మాత్రం రాత్రి చాలా సేపటివరకూ అక్కడే ఉండేది. వెచ్చదనం కోసం కుంపట్లో బొగ్గులు వేసి అమ్మ మంచం క్రింద పెట్టేది. బాదంచెట్టు క్రింద పెట్టిన రోజు బీరువాలో ఉన్న చిన్న సంచీ తెచ్చిచ్చే వరకూ అమ్మని పోరుతూనే ఉంది. అమ్మ ఆవిడ మీద జాలిపడి తెచ్చిచ్చింది. పోయేటప్పుడు కూడా ఇంకా ఈ మమకారమేనా అని అందరూ విసుక్కున్నారు. ఓ నాలుగు రోజుల తరువాత అమ్మమ్మ పోయింది.

ఆవిడ పోయాక తలగడ క్రింద చిన్న చేతి సంచీ. నాన్న విప్పి చూశాడు. అందులో ఒక చిన్న పొట్లం ఉంది. డబ్బేమోననుకొని చూస్తే ఒక చిన్న పిన్నీసుకు చుట్టి పొడవాటి వెంట్రుకలున్నాయి. అమ్మమ్మ అందంగా ఉండేదనీ, పొడవాటి జుట్టుండేదనీ అమ్మ తరచు చెప్పే మాటలు గుర్తొకొచ్చాయి నాకు. అప్పుడర్థమయ్యింది అమ్మమ్మ శిరోముండన సమయంలో ఎందుకు ఏడ్చేదో? అప్పట్లో అర్థం కాకపోయినా ఆవిడ మాటలు ఇప్పటికీ నా చెవిలో మారు మ్రోగుతూనే ఉంటాయి.

“పోయింది జుట్టు కాదురా! స్వేచ్ఛ!”

ఇప్పుడీ మాటలకి అర్థం తెలుసు. దాని వెనుక బాధ కూడా తెలుసు.

***

అనాతవరం వెళ్ళకుండా సరాసరి అమలాపురం హాస్పటల్కి వెళ్ళాను. నేను వెళ్ళిన రోజు అమ్మ నన్ను చూసింది. అతి కష్టమ్మీద మాట్లాడింది. కాచి పెళ్ళి అంటూ మగతగా ముద్దగా మాట్లాడింది. చూడు అంటే కాచిని అందేమోననుకొని అలాగేనని చేతిలో చెయ్యి వేశాను. ఆ మర్నాడు అమ్మ కోమాలోకి వెళ్ళిపోయింది. రెండ్రోజుల తరువాత పోయింది.

పదోరోజు కార్యక్రమాలు పూర్తయ్యాక అన్నయ్య అమ్మ

Matrimonial

Female 23 years, 5'8", B.Tech., Civil, Senior Engineer, Hyderabad Metro Project, L&T. Future Plan - M.B.A/M.S in USA. Gotram – Lohitasya, Interests - Painting and Movies. Contact - apdm65@gmail.com

పేరు మీదున్న బ్యాంక్ లాకరు తెరిపించాడు. అమ్మ పేరు మీదున్న నాలుగెకరాల పొలమూ కాచి పేర రాసిన పత్రాలు చూసి అన్నయ్య అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. నేనూ దెబ్బలాడేను. కాచికి బ్రతకడానికి ఆసరా కావాలని. అమ్మ బంగారం మనవరాళ్ళ కివ్వాలనీ, వంశపారంపర్యంగా వచ్చిన అమ్మమ్మ గాజు మాత్రం కాచికి చెందాలని రాసింది.

అసలు అమ్మమ్మతో నాకు మాటలు పోవడానికి కారణం కూడా ఈ గాజే. ఆవిడ పోయేవరకూ మాట్లాడనంత ద్వేషం నాలో పెరిగిపోయింది. నేను తొమ్మిదో తరగతిలో ఉండగా మా ఇంట్లో అమ్మమ్మ మీద యుద్ధమే జరిగింది. ఎందుకంటే అమ్మమ్మ చేతికి కంకణాల్లాంటి నాలుగు గాజులుండేవి. ఎవరికీ ఇచ్చేది కాదు, మా అమ్మక్కూడా. అలాంటిది ఆ రెండుజతల గాజుల్లో మూడు పోయాయి. ఒకటే ఉంది. శిరోముండనం సమయంలో చేతి గాజులు తీసేసి బీరువాలో పెట్టేది. వచ్చి చూస్తే అందులో ఒకటే ఉంది. మిగతా మూడూ మాయమయ్యాయి. ఆవిణ్ణి ఆట పట్టించడానికి నేనూ, అన్నయ్య దాచామని అనుకున్నారు. అందరూ నన్నూ, అన్నయ్యనే అనుమానించారు. మాకేం తెలియదు మొర్రో అన్నా నాన్న వినిపించుకోలేదు. మామూలు దెబ్బలు కాదు. నాన్న చచ్చేట్లా కొట్టారు. మేం తీయలేదని తెలిశాక నాన్న అమ్మమ్మని గట్టిగా తిట్టాడు. ఆ గాజులు తనకిస్తే బ్యాంకులో పెట్టేవాణ్ణి కదాని కసురుకున్నాడు. అమ్మ కూడా అమ్మమ్మ మీద ఎగిరింది. ఉత్తప్పుడయితే మాటకి మాట చెప్పే అమ్మమ్మ ఆ క్షణంలో నోరు విప్పితే ఒట్టు. ఎవరు తీశారో తెలీదు. ఆవిడ గాజులు మాత్రం పోయాయి. ఆ తరువాత ఆవిడ పోయేవరకూ నేను మాట్లాడితే ఒట్టు. ఆవిడంటే నాకు విపరీతమైన కోపం. ఇప్పటికీ నాన్న కొట్టిన దెబ్బలు నేను మర్చిపోలేదు. ఆవిడ పోయింది. కానీ ఇంకా ఆవిడ మా మధ్య తగాదాలకి కారణం అవుతూనే ఉంది. కాచి పేరునే ఎక్కువ వాటా వెళ్ళడం అన్నయ్యకీ, వదినకీ మింగుడు పడలేదు. ముఖ్యంగా అమ్మమ్మ గాజు మీద వదిన కన్నుపడింది. మంచి నగిషీతో ఉన్న కంకణం లాంటి గాజు కనీసం నాలుగైదు తులాలుంటుంది. ఈ విషయంలో కాచికీ, వదినకీ మధ్య గొడవ జరిగింది. అత్తగారి గుర్తంటూ వదిన ఏడుస్తూ చాలా ఓవరాక్షన్ చేసింది. సెంటిమెట్లకిచ్చే విలువ మనుషులకుండదనుకొని వెనక్కి వచ్చేశాను. ఈ గొడవంతా చూసి కాచి తనపేర రాసింది కాబట్టి తనకే చెందాలని పట్టు పట్టింది. అన్నయ్యా వదినా కొంత గొడవ చేశారు. కాచిని ఎదిరించలేక ఊరుకున్నారు. అన్నయ్య మాత్రం కాచి మీద గుర్రుగానే ఉన్నాడు. ఇదంతా అమ్మమ్మ వల్లే వచ్చిందనుకుంటూ గట్టిగా పైకి తిట్టాను.

"మధ్యలో అమ్మమ్మేం చేసిందట? వీళ్ళని అనలేక ఆవిణ్ణెందుకు తిట్టుకోవడం? అయినా ఆవిడంటే నీకెప్పుడూ పడదు. పోయినవాళ్ళని తిట్టుకోకూడదని..." కాచి అలా అనేసరికి కాస్త వెనక్కి తగ్గాను.

అన్నయ్యా వదినల తీరు చూస్తే కాచికి ఆసరాగా ఉంటార న్న నమ్మకం పోయింది. వాళ్ళ ప్రవర్తన చూసి చికాకేసింది. ఈ రాద్ధాంతం చూసాక కాచితో ఒంటరిగా మాట్లాడలని అమలాపురం వెళ్ళే వంకన బయటకి వచ్చాం.

"కాచీ, ఇప్పటికయినా నా మాట విను. నువ్వు పెళ్ళి చేసుకో! ఇలా అన్నయ్య పంచన ఎన్నాళ్ళుంటావు? నీ కోసం కాక పోయినా ఆ పిల్లాడి కోసమయినా..." అని మరోసారి అమ్మ మాటగా చెప్పాను.

"నువ్వు చెప్పినంత ఈజీ కాదురా అన్నాయ్యా! నాక్కొంచెం టైమియ్యి," అంది.

బయల్దేరుతుండగా చంద్రమతి అమ్మమ్మ ఫొటో అడిగిన సంగతి గుర్తుకొచ్చింది. పాత ఫొటో ఆల్బమ్స్ అన్నీ తిరగేశాను. చిత్రం అమ్మమ్మది విడిగా ఒక్క ఫొటో లేదు. తాతయ్యా, అమ్మ మ్మా ఉన్న ఒక్క ఫోటో ఉంది. గబగబా తీసి బ్యాగులో పెట్టుకుని తిరుగు ప్రయాణం కట్టాను. "నీకేం కావాలన్నా నేనున్నాను, మర్చిపోకు!" అని కాచి చెయ్యి పట్టుకొని చెప్పాను.

***

హైదరాబాదు వచ్చాక చంద్రమతికి ఫోను చేసి అమ్మ పోయిన సంగతి చెప్పాను. వాళ్ళింటికి వస్తానని చెబితే తనే కారు తీసుకొస్తానని చెప్పింది. బొంబాయి చేరగానే ఎయిర్-పోర్ట్ కొచ్చిం ది. కారులో వాళ్ళింటికి బయల్దేరాము. అనాతవరం విశేషాలు చెప్పాను. అమ్మమ్మ ఫోటో సంగతి గుర్తొచ్చి బ్యాగులోంచి తీసి చంద్రమతికిచ్చాను. దానికేసి చూస్తూ కంట నీరు పెట్టుకుంది. "ఈ ఫోటో మీ అమ్మమ్మగారిదే? నా వరకూ ఆవిడ నెత్తిమీద ముసుగే

సుకున్న రూపమే గుర్తుంది. వయసులో ఎంత అందంగా ఉందో ఆవిడ. ముఖ్యంగా ఆ పొడవాటి జడ!"

"ప్రయాణం హడావిడిలో ఆల్బంలో చేతికందిన ఫొటో తీసుకొచ్చాను. ముసుగుతో ఆవిడ ఫొటో ఉంటే పంపమని కాచికి చెబుతాను." అమ్మమ్మ పోయిన సంగతీ పోయినప్పుడు సంచీలో ఉన్న జుట్టు గురించీ చెప్పాను. వింటూ ఏడ్చింది.

"రామం! నిన్ను కలుస్తానని కల్లో కూడా ఊహించలేదు. మీ అమ్మమ్మ ఫొటో చూస్తే ఏడుపొచ్చేస్తోంది. ఇన్నాళ్ళూ నాలో దాచుకున్న నిప్పు నీతో చెప్పుకుంటే కానీ చల్లారదు," అంటూ బిగ్గరగా ఏడ్చింది. ఏం మాట్లాడాలో తెలీలేదు. మౌనంగా ఉండిపోయాను. "...మీ అందరికీ తెలుసు. నేను ఒక మెడికల్ రిప్రజెంటేటివుతో లేచిపోయానని. నిజానికి నాకంత ధైర్యమూ, తెగువా లేవు. పిన్నీ వాళ్ళింటికి అమలాపురం వెళ్ళేదాన్ని. వాళ్ళ పక్కవాటాలో ఆయన ఉండేవారు. నన్ను చూసి పెళ్ళి చేసుకుంటానని చెప్పారు. అమ్మా, నాన్నా ఒప్పుకోలేదు. పైగా ఆయనది కాపు కులం. ఆయన ఒప్పించడానికి ప్రయత్నించారు. ఈపెళ్ళి జరిగితే నాన్న చస్తానని బెదిరించారు. సరిగ్గా ఆ సమయం లో ఈ విషయం మీ అమ్మమ్మ గారికి చెప్పాను. ఆవిడ ప్రేరణ వల్లే..." అంటూ ఆగిపోయింది. "పారిపో! ఇంతకంటే మంచి అవకాశం నీకు జన్మలో రాదు. నిర్భయంగా వెళ్ళి పెళ్ళి చేసుకో! ఏ కులమయితేనేంటి? మగాడేగా? మనిషేగా? అమ్మా నాన్న ఎల్లకాలం ఉండరు. ఈ కూపస్థమండూకాల మధ్య నీకు స్వేచ్ఛ ఉండదు – అంటూ నాకు లేని తెగువా, ధైర్యమూ నూరిపోసింది మీ అమ్మమ్మగారే!"

ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాను. మెల్లగా లేచి బీరువాలోంచి ఒక చిన్న పేకట్టు తీసుకొచ్చి విప్పింది. వాటిని క్షణంలో గుర్తుపట్టాను.

"ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి చూడొద్దని నాకు అవసరానికుంటుందని నాకిచ్చారు. ఇన్నేళ్ళూ పదిలంగా దాచుకున్నాను. నువ్వు కనిపించావు. నా భారం తీరింది. ఇవి మీకు చెందాల్సినివి. తీసుకో!" అంటూ నా చేతిలో పెట్టింది. ఈసారి నాకళ్ళ నీళ్ళొచ్చాయి. శిరోముండన సమయంలో అన్న అమ్మమ్మ మాటలు గుర్తుకొచ్చాయి.

"పోయింది జుట్టు కాదురా! స్వేచ్ఛ!"

## టీచర్ గారమ్మాయ్

గుళ్ళపల్లి అనుపమ.

టీచర్ల పిల్లలకి చదువు బాగా వస్తుందని ఒక టాక్ ఉంది లోకంలో. అది ఎంతవరకు నిజమో తెలియదు కానీ టీచర్ల పిల్లలకి నిజంగా వచ్చేవి ఏమిటో నాకు బాగా తెలుసు. ముఖ్యంగా ఆ పిల్లలు చదివే స్కూల్లోనే వాళ్ళ అమ్మో, నాన్నో పని చేస్తుంటే...అబ్బో...ఆ కథే వేరు.

నాకూ, మా తమ్ముడికీ దగ్గరదగ్గర స్కూల్ చదువు అంతా మా అమ్మగారు పని చేసిన స్కూల్లోనే గడిచింది. అది మా ఊళ్ళో అన్నిటికన్నా గొప్ప పేరున్న స్కూల్. 40-50 మంది టీచర్లలో మా అమ్మగారు ఒక తెలుగు టీచరు. అక్కడు న్నంతసేపూ ఆవిణ్ణి "మిస్" అనే పిలిచేవాళ్ళం. మేము తుమ్మి నా, దగ్గినా ఆవిడకి తెలిసిపోతూ ఉండేది. పరీక్ష అంత బాగా రాయని రోజున "బాగానే రాశాన"ని చెప్పేసినా, మాకు తెలిసేలోపే మా అమ్మగారికి మా మార్కులు తెలిసిపోయేవి. ఇక అల్లరి పనుల కంప్లైంటులకి అయితే హద్దూ-పద్దూ లేదు. వారానికి రెండు-మూడు సార్లైనా మాలో ఒకరి మీద ఏదో ఒక కంప్లైంట్ మా అమ్మగారిని చేరేది.

మాకు బ్యాండు-బాజా ఉందని తెలిసినరోజు సాయంత్రం, ఆవిడ నడుస్తూ ఇంటికొచ్చేలోపు సైకిళ్ళ మీద మేము త్వరగా వచ్చేసి, ఎప్పుడూ చేయని పనులు చేసేసేవాళ్ళం. అంటే...కాళ్ళకి వేసుకున్న సాక్సు లాగి పారేయటం కాకుండా జాగ్రత్తగా చుట్టి తీసి, షూలో చక్కగా పెట్టటం, షూని స్టాండ్ మీద పెట్టటం, క్యారేజీ గిన్నెలు బుట్టలో ఉంచేయటం కాకుండా తోమే దగ్గర తెరిచి పెట్టి నానటానికి నీళ్ళు పోయటం, ఆరేసిన బట్టలు తెచ్చి మడతలు పెట్టేయటం, కాళ్ళూ-చేతులూ-మొహం కడిగేసుకుని బట్టలు మార్చుకోవటం...ఇలాంటివి అన్నమాట. ఆవిడ వచ్చేసరికి పుస్తకం తెరిచి కూర్చుని, గేటు తెరిచిన చప్పుడుకి కూడా తలు

ఎత్తకుండా చదివేసుకుంటూ ఉండేవాళ్ళం. ఆవిడ వచ్చి ఈ వింతలన్నీ చూసేసరికి, ఆవిడ మర్చిపోయిన కంప్లైంట్ ని కూడా గుర్తుచేసినట్లయ్యేది. కానీ అప్పట్లో ఈ నిజం మేము గ్రహించలేక పోయాం. మళ్ళీ మళ్ళీ అల్లరి పనులు చేసిన ప్రతిసారీ ఇలాగే ఉండేది మా షెడ్యూలు. ఒక్కోక్కసారి అయితే ఆవిడకి కంప్లైంట్ అందకపోయినా, అందింది అనుకుని ఇలా ప్రవర్తించటం వల్ల, ఆవిడకి అనుమానం కలిగి "ఏం చేసొచ్చావ్ ఈరోజు?" అని అడిగి మరీ తెలుసుకుని డోసు ఇచ్చేవారు.

మా స్కూల్లో ఎవరి పుట్టినరోజైనా వస్తే క్లాసులో పిల్లలకి ఒకటే చాక్లెట్ ఇచ్చినా టీచర్లకి రెండు-మూడు ఇచ్చేవారు. మా క్లాసులో పాఠం చెప్తున్న టీచరుకి చాక్లెట్ వచ్చిందంటే అక్కడ మా అమ్మగారికి కూడా వచ్చిందని సంతోషించేదాన్ని. ఇక సాయంత్రం వరకు ఆవిడ పర్సునీ, అందులోని చాక్లెట్టునీ ఊహించుకుంటూ ఉండేదాన్ని. ఇది బాగా చిన్నప్పుడులెండి.

మా నాన్నగారు కూడా టీచర్ గానే పని చేసేవారు. గవర్నమెంట్ హైస్కూల్లో ఆయన ఉద్యోగం. ఎప్పుడైనా వాళ్ళ స్కూల్లో యానివర్సరీలకో, పిక్నిక్లకో వెళ్తే పెద్ద యువరాణిని చూసినట్లు "సంస్కృతం మాష్టారమ్మాయ్" అంటూ కొత్తగా, వింత గా చూసేవారు అక్కడ పిల్లలు. న్యూ ఇయర్ డే వస్తోంది అంటే సందడి మొదలయ్యేది. చాలామంది పిల్లలు టీచర్లకి గ్రీటింగ్ కార్డులు ఇచ్చేవారు. మా తల్లిదండ్రులకి వచ్చేవాటిలో ఒక్కొక్క దాని విలువ అర్ధరూపాయి నుండి అరపై రూపాయల వరకు రకరకాలుగా ఉండేది. పెయింటింగ్ వేసిన కార్డులు, కార్టూన్స్ ఉన్నవి, మెసేజ్-లు ఉన్నవి, పూలు, స్వీట్లు...ఇలా రక రకాల కార్డులు డిసెంబర్ 31 నాటికి ఇంటికి చేరేవి. చాలామటుకు కార్డులు బైటవైపు బొమ్మ ఉండి, పుస్తకం తెరిచినట్లు తెరవగానే ఏదో ఒక గ్రీటింగ్ మెసేజ్ ఉండేది.

కొన్ని కార్డులు మాత్రం చాలా వింతగా ఉండేవి. పుస్తకం లా కాకుండా, పోస్ట్ కార్డ్ లాగా ఒకటే పొర ఉండేది. ముందువైపు చుట్టూ పసుప్పచ్చని రంగులో మెలికల మెలికల బోర్డర్ ఉండి, మధ్యలో చిరంజీవి, వెంకటేష్, సౌందర్య, రాశి...ఇలాంటి వాళ్ళ ఫోటో ఉండేది. వెనుక వైపు ఖాళీగా ఉండేది. అంటే ఆ ఖాళీలో వాళ్ళకి నచ్చినది వాళ్ళు రాసి ఇచ్చేవారు. ఆ రాతల్లో కూడా చాలా వెరైటీ కనిపించేది. ఒక కార్డు మీద పైన "మీ సుజాత" అని, మధ్యలో "విష్ యు హ్యాపీ న్యూ ఇయర్" అనీ, అడుగున "మాష్టారు గార్కి" అనీ ఉండేది. ఇంకొక కార్డు మీద చిన్నాభిన్నమై ఉన్న అక్షరాల్ని కూడదీసుకుని చదవగా "నుతన సంవచ్చరం శుబాకంక్షలు మాస్టారు గారు - మేడంగారు" అని ఉండేది.

మరో అభిమాని ఇచ్చిన కార్డులో "ప్రియమైన సంస్కృతం మాస్టారు గారండీ, ఈ సంవత్సరం మీరు కోపం పడకూడదు" అని ఉండేది. కొందరు పిల్లలు చక్కగా వాళ్ళే రంగురంగులలో గ్రీటింగ్ తయారు చేసి ఇచ్చేవారు. అసలు పెద్దవాళ్ళు ఇచ్చిన డబ్బులు దాచుకుని, చదువు చెప్పే టీచర్లకి గ్రీటింగ్ ఇవ్వాలి అనుకునే వాళ్ళ అభిమానం, ఆప్యాయత, అమాయకత్వం చాలా గొప్పవి. నేను మా తల్లిదండ్రులకి వాళ్ళ 'పిల్లలు' ఇచ్చిన గ్రీటింగ్స్ అన్నీ దాచేదాన్ని.

టీచర్ గారి అమ్మాయి అయినందుకు నాకు ఒకొక్కసారి








ఉడుకుమోతుతనం వచ్చేది. మా స్కూల్ పిల్లల్ని అందరినీ ప్రతి సంవత్సరం కర్నాటక, హైదరాబాద్...ఇలా ఏదో ఒక టూర్ కి తీసుకెళ్ళేవారు. పిల్లల్ని చూడటానికి టీచర్లు కూడా వెళ్ళాలి కదా? ఒక్కొక్క టీచర్ కింద 7-8 మంది పిల్లల్ని ఎసైన్ చేసేవారు. మా క్లాస్ అమ్మాయిలు వేరే టీచర్ కింద ఉండగా, నన్ను మా అమ్మ గారి టీం లో వేయాలని మూడు క్లాసులు తక్కువ ఐన పిల్లలతో వేసేవారు. నాకేమో మావాళ్ళతో ఉండాలని ఉండేది. టూర్ రూల్స్ లో కొబ్బరినూనె తెచ్చుకోవద్దని ఉండేది (పిల్లలు చేతకాక మూత లు సరిగ్గా పెట్టకపోయినా, వాడటం చేతకాకపోయినా ఒలికి అన్నీ పాడు చేసుకుంటారని). అది విని నేను ఎగిరి గంతేశాను. వారం రోజులు నూనె తప్పించుకోవచ్చని, ఒక్క జడ, పోనీటైల్...ఇలా రకరకాల హెయిర్ స్టైల్ చేసుకోవచ్చని. కానీ మా అమ్మగారు "అవన్నీ అమ్మలు పక్కన లేని పిల్లలకి. మనం తీసుకువెళ్ళచ్చు" అంటూ చక్కగా నూనె సీసా తీసుకొచ్చి, తలంతా నూనె రాసి, స్కూల్ కి వేసినట్లు రెండు జడలు రిబ్బన్లతో అల్లి వేసేవారు. నేను ప్రతిరోజు మధ్యాహ్నం అయ్యేవరకు మొహం కందగడ్డలా ఎర్రగా చేసుకుని ఉండేదాన్ని. అప్పట్లో నాకు రెండు జడల్లో ఉన్న అందం ఎక్కడ తెలుసు? ఇప్పుడు ముచ్చటగా వేసుకుందామన్నా కుదరదు! కానీ ఏమాటకామాటే! తన స్కూల్లోనే పిల్లల్ని చదివిస్తూ, నిరంతరం యోగక్షేమాలు కనుక్కునే తల్లి ఉండటం ఎంత మందికి దొరికే అదృష్టం? ముఖ్యంగా పిల్లల్ని చదివించే తీరిక కూడా దొరకని కొందరు ఈ కాలపు తల్లుల్ని చూస్తుంటే “ఒక స్కూల్ టీచర్ కూతురిగా గొప్ప గర్వంగా అనిపి స్తుంది. ఒక తల్లిగా , ఒక తండ్రిగా మాత్రమే కాకుండా ఒక టీచర్ గా కూడా ఆలోచిస్తూ ఎప్పటికప్పుడు నడవడికను తీర్చిదిద్దే సత్తా 'ఉన్నవాళ్ళ' కడుపున పుట్టిన అదృష్టవంతురాలిని నేను. ఈరోజు నేను ఏ స్థితిలో ఉన్నా, దానికి నాకు వాళ్ళు చెప్పిన/చెప్పించిన 'చదువే' కారణం. అందుకే నాకు నన్ను 'పెంచిన' ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా గౌరవం. ఎప్పటికైనా 'టీచర్' ని అయ్యే అవకాశం వస్తే తప్పక ఉపయోగించుకుంటాను.

తెలుగు జ్యోతి ప్రకటన దారులను ప్రోత్సహించండి !!!
ఆర్థిక పరిపుష్టికి సహకరించండి !!!



## కొత్త తరం

శ్రీమతి శ్యామలాదేవి దశిక



ఏమిటీ... అక్కడున్నంత సేపు మౌనానంద స్వామిలా కూర్చుని ఇప్పుడు కారు ఎక్కగానే మీలో మీరే అంతలా నవ్వుకుంటున్నారూ?! పార్టీలో ఆ అమ్మాయిలూ అబ్బాయిల భాషా ఆ మాట్లాడే తీరు తలుచుకుంటే నవ్వొచ్చేస్తోందా? వాళ్ళ మాటలు వింటుంటే వీళ్ళు అసలు తెలుగు దేశంలో పుట్టి పెరిగిన వాళ్ళేనా అని అనుమానం వచ్చిందా?

మా బాగా అన్నారు! అక్కడున్న వున్న వాళ్ళందరూ చిన్నవాళ్ళే, ఇండియా నుంచి నిన్నా మొన్నా దిగిన కుర్రకారు! వాళ్ళందరి మధ్యా దిష్టిబొమ్మల్లా మనిద్దరమే ముసలివాళ్ళం! మా మేనత్త మనవరాలిని నేను ఎప్పుడూ చూడలేదు కానీ, వాళ్ళ అమ్మ వసంత, నేను చిన్నప్పుడు కలిసి పెరిగాం. దాని కూతురు ఇక్కడకొచ్చి, వాళ్ళ అబ్బాయి పుట్టినరోజని పిలిస్తే వెళ్ళకుండా ఎలా అని, అలాగే వస్తామని అన్నాను. ఎవరో ఒకళ్ళు మనకు తెలిసిన వాళ్ళు, మన వయసువాళ్ళు వుండక పోతారా అనుకున్నా. మీరన్నట్టు ఆ అమ్మాయల కట్టు, బొట్టు, మాట పద్ధతులు అన్నీ తమాషాగా అనిపించాయి. అక్కడున్నంత సేపు కాస్త ఇబ్బందిగా అనిపించినా మళ్ళీ వాళ్ళ కబుర్లు, మాటలు వింటుంటే చాలా సరదాగానూ ఆశ్చర్యం గానూ అనిపించింది, నిజం!

ఈ వూరికి ఆ వూరు ఎంత దూరమో ఆ వూరికి ఈ వూరూ అంతే దూరం అన్నట్టు... మన తెలుగు దేశం నడిబొడ్డులో పుట్టి పెరిగిన ఈ అమ్మాయిలు ఇంత వెస్ట్రనైజ్డ్‌గా వున్నారేమిటీ అని నేను ఆశ్చర్య పోయానా, మరీ వాళ్ళేమో నా గద్వాల్ చీర, నా జుట్టుముడి చూసి ఈ దేశంలో నలభై ఏళ్లుగా వుంటున్నానని, నేను డాక్టర్ నని విని నోళ్ళు తెరిచారు! ఒక అమ్మాయైతే నేను ఖచ్చితంగా సామర్లకోట సరుకే అనుకొని, 'డెలివరీ వీసా మీద ఇక్కడికి వచ్చారా మామ్మా?' అని మొహానే అడిగేసింది!

మరీ అంతలా నవ్వకండి! అమెరికాలో ఓ పెద్ద కంపెనీకి సి.ఈ.ఓ గా వుంటున్న మిమ్మల్ని పట్టుకుని, 'మనవళ్ళకు బేబీ సిట్టింగ్ చెయ్యడానికి, టైం పాస్ కోసం ఇక్కడికి వచ్చారా తాతగారూ?' అని ఆ కుర్రాళ్ళు అడగటం నేను విన్నాను లేండి! అక్కడ తుర్రుమంటూ స్కూటీలమీద తిరిగే ఈ అమ్మాయిలకు ఒక్కళ్ళకు చీర కట్టుకోవడం కూడా రాదట! అలా అయితే ఎలాగర్రా అంటే, 'నాకు చూపుల్ ఎరేంజ్ చేసినప్పుడు మమ్మీ హెల్ప్ చేసింది.మారేజ్ టైంలో మేకప్ వుమన్ వుంది కాబట్టి నో ప్రాబ్లమ్,' అంటూ రెండు వారాల కిందటే పెళ్ళి చేసుకుని వారం కిందటే ఫ్లైట్ దిగిన ఓ పిల్ల ముద్దు ముద్దుగా చెపుతోంది! ఆ పిల్లల మాటలు వింటుంటే వాళ్ళ లైఫ్ స్టయిల్ చూస్తుంటే అందరూ బాగా వున్నవాళ్ళ లాగే వున్నారు. వాళ్ళ వ్యవహారం చూస్తుంటే మన లాగా బతుకుతెరువు కోసం అమెరికాకు వచ్చినట్టు లేదు, సరదా గా గడపటానికి ఏ పిక్నిక్కుకో వచ్చినట్టుంది.

రోజు ఎవళ్ళు వంటలు చెయ్యరుట. బయటే తినేస్తారుట. దటీజ్ నో... ఈజీ నో! అంటూ చాలా ఈజీగా చెప్పేశారు. అదేదో గొప్ప విషయం అన్నట్టు ఏమాత్రం సంకోచం లేకుండా, 'అయాం నో నాట్ ఇంట్రస్టెడ్ ఇన్ కుకింగ్ ఆంటీ! కుకింగ్ ఈజ్ బోరింగ్! డైలీ కుకింగ్ ఈజ్ వేస్ట్ ఆఫ్ టైం,' అని ఆ అమ్మాయిలు రాగాలు తీస్తుంటే నమ్మలేకపోయాను. ఇలా అంటూనే, నేను పట్టికెళ్ళినవన్నీ మళ్ళీ అందరూ ఇంటరెస్టింగ్ గానే తిన్నారు. ఒకళ్ళిద్దరు మాత్రం ఎప్పుడైనా వంట చెయ్యాలనిపిస్తే ఏ స్కైప్ లోనో, ఫేస్ టైం లోనో వాళ్ళ అమ్మల్ని పిలిచి అప్పుడు స్టవ్ వెలిగిస్తారుట!

వంట గురించి వాళ్ళకున్న అవగాహనా వాళ్ళు వాడే మాటలు తమాషాగా కొత్తగా వున్నాయి, నామటుకు నాకు నిజం చెప్పొద్దూ! బొబ్బట్టుని స్వీట్ పూరీ అంటూ ఈ డిష్ ప్రొసీజర్ ఏంటీ అంటూ ఓ అమ్మాయి స్టైల్‌గా అడిగింది. పచ్చి శెనగపప్పుకు వేయించిన శెనగపప్పుకు తేడా తెలీదు. పిండి తడుపుకోవాలమ్మా అంటే టైట్ గానా లూజ్ గానా అని అడిగింది ఇంకో అమ్మాయి. పెళ్ళై రెండేళ్ళయిందిట. భార్యాభర్తలిద్దరూ ఒకే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లట. క్యాబేజ్ కొబ్బరి కూర చూసి, 'ఈ కర్రీ నేను చేస్తే వెట్‌గా వస్తుంది ఇంత డ్రైగా ఎలా ప్రిపేర్ చేశారు?' అని ఒక పిల్ల అడిగితే, "గోంగూర చట్నీ స్మూత్‌గా రావాలంటే లీవ్స్‌ని వాటర్‌లో కుక్ చెయ్యాలా" అంటూ అడిగిందో ఇంకో అమ్మాయి. ఎవ్వరూ ఈ దేశానికొచ్చి మూడేళ్ళు కాలేదంటే నమ్మబుద్ధి కాలేదు, మీకేమని

పించిందో ఆ అబ్బాయిలని చూసి, కానీ. పేరుకు తెలుగు మాట్లాడుతున్నారే కానీ అందులో తెలుగే లేదు. అక్కడున్న వాళ్ళలో ఒక అబ్బాయికి మా వాళ్ళు బాగా తెలుసుట. మా ఆఖరి తమ్ముడి కొడుకు కార్తీక్ ఇతను మంచి ఫ్రెండ్స్ అట. అతని తెలుగు విని తీరాలి! “ఈ మధ్య మా కజిన్ పెళ్లికి వెళ్లినప్పుడు మీ బ్రదర్ వాల్లని కూడా మీట్ అయ్యా. అందరం కల్సి మీల్స్ చేసాం. మస్తుగ ఫన్నుండే. మా సిస్టర్ కి మాచ్ లుక్ చేస్తున్నాం. ఇంతకు ముందు ఒకల్లతో ఎంగేజ్మెంట్ అయి తర్వాత బ్రేక్ అయింది ఆంటీ,’ అంటూ ఏవేవో కబుర్లు చెప్పాడు! నాకు నవ్వు రాలేదు కానీ, వింతగా అయితే అనిపించింది. ఇదేమీ నా చాదస్తం కాదు, మీరూ రుకోండి! అప్పటికీ మీకలా అనిపించనట్టు నన్నేమీ నమ్మించక్కర్లేదు.

హై టెక్ యుగంట! అందులో పెరిగిన ఈ పిల్లల్ని చూస్తుంటే ఇక్కడ పుట్టి పెరిగిన మన పిల్లలే నయం అనిపిస్తోంది, ఇప్పుడు. మన పిల్లలు పెరుగుతున్నప్పుడు అక్కడ పిల్లల్ని చూసి ముచ్చటపడే వాళ్ళం. ఆ రోజుల్లో ఇండియాలో పిల్లలు అందర్నీ చక్కగా వరస పెట్టి పిలిచేవారు. మన పిల్లలేమో బంధు వులైనా స్నేహితులైనా అందర్నీ అంకుల్, ఆంటీ, అని పిలిచే వాళ్ళు. ఎన్ని కష్టాలు పడ్డామో గుర్తు లేదూ? మన పిల్లలకు వావీ వరసలు నేర్పించడానికి. ఇప్పుడు ఇండియాలో పిల్లలు మన పిల్లల్ని మించిపోయారు. వాళ్లకు కనిపించే ప్రతివాళ్ళు అంకుల్, ఆంటీ లే. పాలు పోసే అతన్ని పాల్ అంకుల్ అనీ, కూరలబ్బిని వెజిటబుల్ అంకుల్ అనీ, రోడ్లు ఊడ్చే ఆమెను స్వీపింగ్ ఆంటీ అని పిలిచేస్తున్నారు! ఇండియాలో పిల్లల్ని పెంచే తీరు బాగా మారిపోయింది. దానికి తగ్గట్టే వాళ్ళ ప్రవర్తనలో మాటలో బాగా మార్పు వచ్చేసింది. దూరంగా ఉండబట్టి మనకే ఇంత తేడాగా అనిపిస్తోందో, లేదూ అక్కడివాళ్ళకీ తెలుస్తోందో లేదో అర్థం కాకుండా ఉంది సుమండీ.

వెనక రోజుల్లో అమెరికాలో మన పిల్లలు మరీ అయోమయంగా పెరుగుతున్నారని శెలవుల్లో ఇండియా పంపించే వాళ్ళం. ఇప్పుడు అక్కడ కూడా ముఖ్యంగా సిటీల్లో పెరుగుతున్న పిల్లలకి బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేకుండా పోతోందిట! పుడుతూనే ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ, కార్లల్లో ఇంటర్నేషనల్ స్కూళ్లకు వెళ్తూ,




రోజూ పిజ్జాలు, పాస్తాలు, బర్గర్లు తినే ఈ పిల్లలకి ఓ మొక్క పేరుగాని, అది ఎలా పెరుగుతుంది అనిగాని, ఫలానా పండగ ఎందుకు చేసుకుంటామని గాని, అలాంటివి ఏమీ తెలియకుండా పెరుగుతున్నారు. ఈ అమ్మానాన్నలకి ఏం చెయ్యాలో తెలీక అప్పట్లో మనం, మన పిల్లల్ని దేశం పంపించినట్లు ఇప్పుడు వాళ్ళ పిల్లల్ని వూళ్ళకు పంపిస్తున్నారు. ఇలా పల్లెటూళ్ళకు తీసికెళ్ళటం ఇప్పుడో పెద్ద ఫాషన్ అయిపోయిందిట! అందుకే కాబోలు విలేజ్ పీపుల్కి విలేజ్ మేనర్స్ అంటూ ఇన్నాళ్ళూ వెటకారంగా మాట్లా డిన మా వదిన ఇప్పుడు పనిగట్టుకుని మనవడ్ని మా వూరు తీసికెళ్తోంది! ఏమిటో మనిషి మనస్తత్వం! ఎప్పుడూ ఏదో కొత్తదనం కోసం వెంపర్లాడుతూ వున్నదాన్ని పోగొట్టుకుంటూ వుంటాడు.

ఏమిటీ? ఏమైనా ఆ కుర్రకారు భాషాజ్ఞానం ముందు మీరో కాళిదాసూ, వాళ్ళ తెలుగుతనం ముందు మన పిల్లలు ఆణిముత్యాలూ అంటారా?! మన పిల్లల పెంపకం అదంతా మీ గొప్పే అనుకుంటున్నారూ?!

( ఈ మాట నుంచి పునుర్ముద్రితం)

## రిటైరు మెంటు

దూపాటి శేషుకుమారచార్యులు , హైదరాబాద్ (ఇండియా)

"ఏం తాతా రిటైరుమెంటు దగ్గరకు వచ్చిందటగా" అన్నాడు మా మనమడు ఆదిశేషు ఒకరోజు. అవును రా తాతా ఎప్పుడైనా తప్పదు కదా అన్నాను నవ్వుతూ! ఇంత వయస్సు వచ్చినా నీలో హుషారు తగ్గలేదు, కారణం ఏమిటో అన్నాడు మళ్ళీ. ఆ ఏం వుంది నా కంటే ముందుగా మీ అమ్మమ్మ రిటైరు కాకపోవడమే. ఆవిడ వంట ఇంకా తినడమే అన్నాడు రహస్యంగా గుసగుస లాడుతూ. నేను ఈ మధ్య ఓ నిర్ణయం తీసుకున్నురా మనమ డా నీకు పెళ్ళి చేసి కృష్ణా రామా అనుకుంటూ ఇద్దరం ఏ కాశో రామేశ్వరమో వెళ్ళి పోతాంరా అన్నాడు కళ్ళలో నీరు కనపడనీ యకుండా. మొదటి దాని కన్నా రెండోది బాగుందిరా తాతా! అదే నాపెళ్ళికేం తొందరొచ్చింది అన్నాడు. ఏం లేదురా నీ పెళ్ళి చూడకుండా చచ్చిపోతేనో అనగానే నోరు మూసాడు. అలా అనకు తాత నాకు భయం వేస్తుంది అన్నాడు కళ్ళనీళ్ళతో.

ఆది శేషుకు తాతయ్య అంటే చాలా ఇష్టం. పేరు నరసింహం. నరసింహం కోఆపరేటివ్ బ్యాంకులో మేనేజరుగా పని చేస్తూ వచ్చే నెలలో రిటైరవుతారు. మంచి పేరు సంపాదించు కున్నాడు. అందరికీ ఇష్టుడు. ఆది శేషుకు కూడా క్లర్కుగా ఉద్యో గం ఇప్పించాడు. శేషు పదవ తరగతిలో ఉండగా వాళ్ళ అమ్మ చనిపోయింది. సొసైటీలో క్లర్కుగా చేర్పించాడు. కష్టపడి పని చేస్తా డు. చెల్లెలు, తమ్ముడు కూడా చిన్న వాళ్ళు అవటం వలన ఆ బాధ్యత మీద పడటం వలన పరీక్షలు ఫెయిల్ అయ్యాడు. ఆ తరువాత పెళ్ళి చేసుకోన్నాడు. దాంతో అమ్మ కూర్చోపెట్టి చదివిం చడం వలన పరీక్ష గట్టెంకించాడు. ఇంటరులో తప్పేసరికి సూపర్ వైజర్ జాబు ఇప్పించాడు. దానికి జీతం అయిదువేలు. సున్నం డంగు ఎన్ని ట్రిప్పులు తిరిగిందో లెక్కపెట్టడం. సరేనని ఓ వారం రోజులు పని చేయగానే జ్వరం వచ్చింది. దానిని టైఫాయిడు గా నిర్ణయించి మందులు వాడారు కాని తగ్గలేదు. దాంతో ఉద్యోగం పోయింది. ఆది శేషుకు రెండో పెళ్ళంటే మంచి అభిప్రాయం కూడా లేదు. పిన్నంటే రాచి రంపాన పెడ్తుందని పిల్లలను సరిగా చూడదని సినిమాలలో చూడటం వలన కలిగిన అభిప్రాయం. కానీ వచ్చిన అమ్మ మాత్రం దేవత. చాలా ప్రేమగా చూస్తుంది. జ్వరం వచ్చింది చాలా సేవలు చేసింది. కదలలేక పోతే అన్నీ తానే చేసింది. కాళ్ళు నొక్కింది, రోజు రాత్రిళ్ళు మేలుకొని మందులు వేసింది. "కాళ్ళు నొప్పులుగా వున్నాయా అంటూ కాళ్ళు పిసికేది". వద్దమ్మా బాగానే వున్నాయి అన్నా సరే చూడు నాయనా నేను నీ కన్నతల్లే అనుకో అంటూ ప్రేమగా తలనిమిరేది.

శేషు కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగేవి. మళ్ళీ జన్మంటూ ఉంటే నీ కొడుకుగా పుడతానమ్మా ఇప్పటికే చాలా శ్రమ తీసుకున్నావని అంటూ బోరున ఏడ్చాడు. కొన్నాళ్ళకు ఓ కొడుకు పుట్టిన ఆ మమతను అందరికీ సమానంగా పంచింది. కొన్నాళ్ళకు

తండ్రి చనిపోవడంతో వాళ్ళ బాధ్యత కూడా తీసుకుని దేనికీ లోటు లేకుండా చూసాడు. ఆది శేషు డిగ్రీ పూర్తి చేసి కోపరేటివు ట్రైనింగు పూర్తి చేసి బ్యాంకులో క్లర్కుగా జాబు వచ్చింది. ఓ రేయి నాకో మంచి కోడలు పిల్ల కావాలి నాకా వయస్సు మీరుతున్నది నీ పెళ్ళి చూడకుండా పోతానేమోనని దిగులుగుందిరా.......

అమ్మా అలా అనకు అన్నాడు శేషు కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా. అమ్మే లాభం లేదని ఓ మంచి సంబంధం చూసి దేవకితో ముడి పెట్టింది. కట్నం ఏం తీసుకోలేదు. దాంతో పద్మ పెళ్ళి బాధ్యత వాళ్ళు తీసుకున్నారు. కాలం గడిచేకొద్దీ ఆదిశేషు కష్టపడి పనిచేయడం వలన మేనేజరుగా ప్రమోషను వచ్చింది. మానసికంగా, శారీరకంగా బాధలు పెట్టిన భరించి ముప్పయి అయిదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసాడు. ఓర్పు...సహనంగా పనియే ప్రధానంగా చేసేవాడు. రికమండేషన్లకు పని చేసేవాడు కాదు. డబ్బుకు ఆశ పడడు. అది అందరికీ నచ్చిన మొదటి కారణం. కానీ ఆఫీసర్లకు మాత్రం అది నచ్చలేదు. ఎవరికి కోపం వచ్చినా ముందు ట్రాన్సఫరు చేసేవారు. దానికి కారణం ముక్కు సూటిగా మాట్లాడే స్వభావం కాబట్టి. రిటైర్ మెంటు రోజు రానే వచ్చింది. సాయింత్రం ఆరు గంటలకు ప్రారంభమైంది. ఒక్కక్కరే మాట్లాడటం ప్రారంభించారు. ముందు అందరూ పొగిడారు. ఆ కవరు అందించారు. శేషుగారు ముక్కు సూటిగా మాట్లాడే వ్యక్తి దేనికీ భయపడక దేనినీ ఆశించలేదని ఎక్కడికి ట్రాన్స్ ఫరు చేస్తే అక్కడికి వెళ్ళి అక్కడ మంచి పేరు తెచ్చుకున్నారు అంటుంటే లోలోపల పొంగి పోయారు. భోజనాలు ముగించి అందరు బహుమతులు ఇచ్చారు. బహుమతులు కావవి, ఆయన పాలిట శాపమని తెలియలేదు.

బయటకు వచ్చి ఆటో పిలిచి ఇంటికి పోనిమ్మన్నాడు. దేవకి గుమ్మంలో నిలబడి ఉంది. బాగా జరిగిందా ఫంక్షను అంటూ మంచినీళ్ళు అందిస్తూ. ఆ బాగానే జరిగింది లే అన్నాడు ముక్తసరి గా. నిద్ర పట్టక అటుఇటు తిరగసాగాడు. చేయని తప్పుకు శిక్ష వేసాడు జి ఏం. జేబులోని ఉత్తరం తీసి చదివాడు. ఒకసారి దేవకిని చూసాడు ప్రశాంతంగా నిద్ర పోతున్నది. ఏమండీ రేపు పిల్లల దగ్గర కు వెళ్దామండీ. చాలా రోజులయింది అంటూ కలవరిస్తుంటే జాలిగా చూసాడు. ఇంకా బంధాలు వీడని పక్షులం మనం అనుకొంటూ చిరునవ్వుతో ఎగిరే ముంగురులు సవరిస్తూ. చాలా అందంగా కన్పించింది నల్లని ముంగురులు మొహం మీద పడుతుంటే చంద్రుణ్ని కప్పే నల్లని మబ్బులాగా అనిపించింది. నల్లని ఆ కాటుక కళ్ళకు పెట్టుకొని జడలో గుభాళింపుల మల్లెలు తురిమింది. మెల్లగా కదిలింది ఇంకా నిద్ర పోలేదా అంటూ ఆ పక్కకు తిరిగి. వరండాలో కాలెండరు వెక్కిరిస్తూ ఆహ్ రేపటినుండి రెస్టే కదాని.

ఉత్తరం ఎన్ని సార్లు చదివినా అక్షరాలు సరిగా కనపడటం లేదు. నీవు నీ డ్యూటీని సరిగ్గా నిర్వర్తించని కారణంగా మీకు రావ లసిన బెనిఫిట్స్ ఆపుతున్నామని ఉంది. శేషు చేయని తప్పుకు శిక్ష వేశారు. అంతకంటే ముందు పని చేసిన వాళ్ళ చేసిన తప్పులకు గుర్తించి రిపోర్ట్ పంపడం. ఎవరిని ఏమని లాభం అంతా నా ఖర్మ అనుకొని మంచం మీద వాలాడు. కళ్ళు మూసుకు న్నాడు. ఉత్తరం చదివి ఫ్యానుకు తాడు కట్టుకొని ఉరి వేసుకుంటున్నట్లు. మెలుకువ వచ్చింది టైం చూసాడు. రెండు గంటలైంది. బయటకు వెళ్ళాడు. నేను బ్రతికి ఉండగా జరగని న్యాయం నేను పోతే జరుగుతుందా అనుకున్నాడు.తెల్లారింది శేషు కనపడలేదు. దొడ్లోకి వెళ్ళి వెతికారు. కాలవ ఒడ్డున ఎవరో చనిపోయారని అంటే అందరూ పరిగెత్తారు. ఉత్తరం కనపడింది. త్రీవ్ర మనస్తాపంతో చచ్చిపోతున్నట్లు దీనికి కారణం నా అనారోగ్యకారణమని దీనికి ఎవరూ బాధ్యులు కారని వుంది. ఇంతలో పోస్టు మాన్ వచ్చాడు ఓ కవరుతో. సంతకం చేసి తీసుకుని చదివిన దేవకి ఒక్కసారిగా కుప్పకూలింది. అందులో శేషు తప్పు ఏమి లేదని అందుకు క్షమాపణ కోరుతున్నట్లు తనకు రావలసిన బెనిఫిట్లు చెక్కు పంపుతున్నట్లు.

తనవిధి రాతను తిట్టుకోవడం తప్ప ఏం చేయలేక పోయింది దేవకి.

---

స్కూల్ బిల్డింగ్ కాలిపోతుంటే పిల్లలందరూ కేరింతలు కొడుతూ బయటకి వచ్చేశారు. బూడిద కుప్ప గా నిలబడ్డ స్కూల్ని చూస్తూ నిలబడ్డ వెంకడ్ని అడిగాడో రిపోర్టరు. "స్కూల్ కాలిపోయి – రేపట్నుంచీ స్కూల్ ఉండదని బాధ గా వుందా?" "నీ మొహం ! స్కూల్ పోయింది కానీ మేస్టార్లున్నారు కదా ... అదీ నా బాధ !!"


... YOUR JEWELER FOR EXQUISITE DESIGNS ...
... HALLMARK JEWELLERY ...
... BEST IN QUALITY AND PRICES ...
... EXCELLENT CUSTOMER SERVICE ...
... WE BUY AND EXCHANGE OLD GOLD ...
... WE BUY AND SELL 24K GOLD AND SILVER BARS / COINS ...
Swarna Jewels
Quality, our Tradition
2101 STREET ROAD BENSALEM PA 19020
WWW.SWARNAJEWELS.NET
PH: (215)-633-0708
TIMINGS:
11:30 AM – 7:30 PM
TUESDAY CLOSED
For more details, contact store.

**Telugu Fine Arts Society (TFAS)**
**c/o Vamsi Koppuravuri**
**1 Newburgh Drive, Edison, NJ - 08820**

PRSRT STD
US Postage PAID
Permit #6
New Brunswick, NJ

**Return Service Requested**

*****************************************************************************************


# *Shanthi Travel, Inc.*

194 Diamond Bridge Ave., Hawthorne, New Jersey 07506
Ph. 973-423-4444; FAX: 973-423-4459
Shanthitravel_99@yahoo.com

SATYAM SRIKONDA, PRESIDENT

Authorized ticket agent for all major airlines to
India, Europe, Asia and anywhere worldwide.

Full Service cruise, tours & travel service office -
part of American Express Travel Network of
1700 travel offices worldwide offering personalized attention.

Professional planning from beginning to end.
FEE-FREE AMERICAN EXPRESS TRAVELLERS CHECKS.
Comes with free passport and credit card replacement assistance.

Ask us about additional benefits and special prices available
for booking tours and cruises for American Express cardholders.
Experiences travel counselors to plan, assist and help
for group travel for families, reunions, and Continuing Education programs.

Hours:
Monday – Friday: 10 AM – 5 PM
Saturday: 10 AM – 12 Noon
For Emergencies Please Call:
973-423-4444 any time